
# శాంతి

# SANTI

విశ్వమానవ సాభ్రాతృత్వ సందేశము గల ఆధ్యాత్మిక మాసపత్రిక

September / సెప్టెంబర్ -2023

ప్రణవోధనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్ తన్మయోభవేత్



పరమపూజ్య శ్రీ స్వామి ఓంకార్ మహారాజ్

జననం : 1895 మరణం : 1982

## లోకశాంతి ప్రార్థన

(వ్యక్తి శాంతికి - విశ్వశాంతికి)

పూజనీయమైన ఓ దివ్య స్వరూపా!
మా లోపలను వెలుపలను మీదను క్రిందను అంతటను
నిండియున్న ఓ సర్వాంతర్యామి! మా లోపల ప్రత్యణువు
నందును ఇమిడి యుండి మా నేత్రములకు నేత్రము,
కర్ణములకు కర్ణము, హృదయములకు హృదయము,
మనస్సులకు మనస్సు, శ్వాసలకు శ్వాస, ప్రాణములకు ప్రాణము,
ఆత్మలకు ఆత్మవై వెలుగొందు ఓ దేవా! ప్రేమైక మూర్తీ !
నిన్ను తెలుసుకొను భాగ్యము ఇప్పుడు ఇచ్చటనే మాకు ప్రసాదింపుము.
ఓ తేజోమయమూర్తీ! తూర్పు పడమరల
ఉత్తర దక్షిణముల, ఈ విశ్వము నందంతటను అందరును
నీ దివ్య తేజస్సును గ్రహింతురు గాక!
ఓ సచ్చిదానంద స్వరూపా !
ప్రతి మానవ హృదయమునందును, నానాజాతి మధ్యమునను
శాంతి సామరస్యములను ప్రతిష్ఠింపజేయుము.
ఓ దేవా! ఇదియే మా మనః పూర్వకమైన ప్రార్థన.

లోకాస్సమస్తా స్సుఖినో భవంతు !

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

ఏకం సత్ విప్రా బహుధా వదంతి
ఒకే సత్యము అనేక విధములుగా బ్రహ్మజ్ఞులచే చెప్పబడినది.
- ఋగ్వేద సంహిత


# శాంతి

# SANTI

**విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక**

**స్థాపకులు : పరమపూజ్య శ్రీస్వామి ఓంకార్‌జీ మహరాజ్**

**సంపాదకులు : స్వామిని వినమ్రానంద**

VoL./ సంపుటి : 99 September / సెప్టెంబర్ -2023 No./ సంచిక : 9



| వ.నెం. | విషయసూచిక | పేజి నెం. |
|---|---|---|
| 1. | ప్రార్థన – నిరఞ్జనాష్టకమ్ (శ్రీ శంకరాచార్య విరచితం) | 2 |
| 2. | ధ్యానము – ఆత్మ విద్యావిలాసము | 2 |
| 3. | శ్రీ ఓంకార్ ఆత్మకథ – అనువాదం : బొప్పన అరుణాదేవి | 3 |
| 4. | శ్రీకృష్ణ జన్మాష్టమి –పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజి | 9 |
| 5. | గురువాచక కోవై – మురుగనార్ | 10 |
| 6. | ఆనంద రామాయణము – పరిష్కర్త: స్వామి సత్యాత్మానంద | 12 |
| 7. | తులసీ సర్వస్వము – శ్రీ జి.వి.యస్. సుబ్రహ్మణ్యం | 14 |
| 8. | ఆహారమే మనస్సుగా మారుతుంది– అమిరపు నటరాజన్ | 17 |
| 9. | వెలకట్టలేనిది–శ్రీ బొల్లినేని కోటేశ్వరరావు గారు | 19 |
| 10. | కర్మాబాయి చరిత్రము – మహాభక్తవిజయము | 21 |
| 11. | హనుమత్సముద్రోల్లంఘనం – బ్రహ్మచారిణి | 24 |
| 12. | కార్యక్రమములు – విరాళములు | 26 |



**ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి / రచయితలే బాధ్యులుకాని, సంపాదకులు కారు.**

జీవిత సభ్యత్వం రూ. 1000/- లు సాలుసరి రూ. 100/-




# ప్రార్థన

## శ్రీ శంకరాచార్యకృత నిరఞ్జనాష్టకమ్

శ్లో॥ **స్వర్గే న మర్త్యే నగరే న సత్రే,**
**జాతే రతీతం న చ భేదభిన్నమ్ ।**
**నాహం న తత్త్వం న పృథక్ పృథక్ త్వాత్,**
**తస్మై నమో బ్రహ్మనిరఞ్జనాయ॥**

స్వర్గ మర్త్యములు కానిది, నగర సత్రములు కానిది, జన్మముగాక. భేద భిన్నత్వములు కానిది, అహం తత్త్వము కానిది, పృథక్ తత్త్వములు గాక ఒప్పుచుండెడు నిరంజన బ్రహ్మమునకు నమస్కారము.

# ధ్యానము

శ్లో॥ **ప్రత్యక్చితి త్వపురిదం న భవే జ్జడాత్మా**
**కుడ్యాదివ జ్జడతయా పృసవో న చిత్స్యుః ।**
**నాప్రీంద్రియాణి కరణం కుత ఏవ చిత్స్యాత్**
**కుద్దాలకాదివ దితి ప్రవిచారయ త్వమ్॥**

ఈ శరీరం, గోడ మొదలైన వాటివలె జడస్వభావం కలిగినది. చితి కాదు. పంచప్రాణాలు కూడా జడత్వకారణం చేత చితికాదు. ఇంద్రియాలు కూడా కావు. గొడ్డలి మొదలైన పనిముట్లు వంటివి. చితి ఎలా అవుతాయి? ఇలా నీవు గాఢంగా చింతించు. **(ఆత్మవిద్యావిలాసము)**

"సత్యము వచించుటయే కలియుగములో తపస్సు సుమా! సత్యమును అంటిపెట్టుకొనియున్నచో తప్పక భగవద్దర్శనము కలుగును.

జగజ్జనని దివ్యదర్శనమొసగిన పిమ్మట నేను పుష్పములు చేతపట్టుకొని – "అమ్మా! నీ జ్ఞానమును అజ్ఞానమును నీకే సమర్పించుకొనుచున్నాను; నాకు శుద్ధభక్తిని ప్రసాదింపుము, యిదిగో నీ మడి–మైల, రెండింటినీ నీవే తీసుకొనుము. నాకు పరిశుద్ధ భక్తినే ప్రసాదింపుము, నీ పాపపుణ్యములు; మంచి–చెడులు, నీ ధర్మాధర్మముల వీనినెల్ల నీవే తీసుకొనుము, నాకు మాత్రము అచంచల భక్తిని ప్రసాదింపుము," – అని పల్కి తల్లిపాదముల కడ పుష్పాంజలి సమర్పించుకొంటిని.

అన్నింటిని తల్లికి సమర్పించుకొనగలిగితిని గాని, సత్యమును మాత్రము తల్లికి సమర్పింపజాలకపోతిని".

**– శ్రీ రామకృష్ణ పరమహంస**

# శాంతి ప్రదాత శ్రీ ఓంకార్ స్వామిజీ ఆత్మకథ

*మూలం : స్వామిఓంకార్* *అనువాదం : బొప్పన అరుణాదేవి*

## అధ్యాయం - 46

## అమెరికా ప్రయాణంలో మధ్య మధ్య ఆగటం

**రంగూన్, బర్మా - జె. చటర్జీ**

1937 మార్చి 10వ తేదీన పూజ్య స్వామీజీ మరియు సుశీలాదేవి గార్లు అమెరికా దేశం వెళ్ళి శాంతి సందేశాలను ప్రచారము చేయడానికి, విశ్వమానవ సౌభ్రాత్రాన్ని నెలకొల్పడానికి ప్రయాణమయి మార్గమధ్యంలో రంగూన్ వచ్చారు. వారి విడిది సమయంలో పవిత్రాత్మ స్వరూపులయిన రాజ్‌కృష్ణగారు, రంగూన్ ఇంజనీర్ డిపార్టుమెంట్ ట్రస్టు సభ్యులు, భక్తుడు వారికి ఎంతో ప్రేమపూర్వకంగా, జాగ్రత్తగా అతిథి సత్కారాలు ఏర్పాటు చేశారు.

వారి రాక గురించి తెలుసుకుని కొద్దిమంది భక్తులు వారికి మనస్ఫూర్తిగా స్వాగతం పలికారు. కాని అతి తొందరలోనే పూజ్య స్వామీజీ నిండయిన విగ్రహము, పసిపిల్లవాడి లాంటి నిర్మలత్వము, పవిత్రత, ప్రేమ స్వరూపము చాలా పెద్ద జన సమూహాన్ని ఆకర్షించింది. అందువలన స్వామీజీ, సుశీలాదేవి అతి తొందరలోనే అతిథులను, వారిని కలవడానికి వచ్చే భక్తులను పలకరించటంలో పూర్తిగా నిమగ్న మయిపోయారు. అయినా వారు ఎప్పుడూ విసుగు చెందటం గాని, అలసి పోవటం గాని జరిగేది కాదు. పైగా వారు ఎంతో సంతోషించేవారు. స్వామీజీ వారి ప్రేమతో ప్రతి ఒక్కరిని బందీగా చేసుకునేవారు. ఆయనకి పేద, గొప్ప తారతమ్యం లేదు. అందరిపట్ల ఒకే విధమయిన గౌరవాన్ని ప్రకటించేవారు. వారు విడిది చేసిన ప్రదేశము అన్ని మత సంప్రదాయాల వారు కలుసుకునే సమావేశ స్థలంగా మారి పోయింది.

స్వామీజీ ఎక్కువగా ప్రసంగాలు చేయడానికి ఇష్టపడేవారు కాదు. కాని ఆయన మౌనంగా కూర్చున్నప్పుడు భక్తులు వారి ఎదుట కూర్చుని ఎంతో ఆనందాన్ని పొందేవారు. తన వద్దకు వచ్చేవారికి సందేశాలు, ప్రవచనాలు చేయడానికి బదులుగా స్వామీజీ వారితో ప్రార్థనలు, ధ్యానము చేయమని చెప్పేవారు. వారు ఓంకారాన్ని ఉచ్ఛరించగానే అందరి హృదయాలు దివ్యత్వంతో నిండిపోయేవి. ఆయన తన హృదయాన్ని తన ప్రార్థనల ద్వారా అందరికీ పంచిపెట్టేవారు. వినేవారిని కట్టిపడేసే విధంగా నైపుణ్యంతో, వాగ్ధాటితో ప్రసంగాలు చేయటం పట్ల స్వామీజీకి అంత ఇష్టం ఉండేదికాదు. వారి మౌనం ఎన్నోరెట్లు ఎక్కువగా భక్తులను ప్రభావితం చేసేది. స్వామీజీ ఆచరణకి ఎక్కువగా ప్రాధాన్యము నిచ్చేవారు.

స్వామీజీ సుశీలాదేవితో సంప్రదించి మార్చి 21వ తేదీన సోనీరామ్ హాలులో



ప్రజలందరికి బహిరంగ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆ రోజు అనుకున్న సమయం కన్నా చాలా ముందుగానే జనం ప్రవాహంలాగా స్వామీజీ దర్శనానికి ఎంతో ఆత్రుతతో రాసాగారు. అందువలన ఆ సమావేశ ప్రదేశం జనంతో కిక్కిరిసిపోయింది.

సమయం రాగానే స్వామీజీ వచ్చి సమావేశమయిన భక్త జనసమూహాన్ని ఉద్దేశించి ఎంతో ఉత్తేజపూరితమయిన ప్రసంగాన్ని దాదాపు గంటన్నరసేపు కొనసాగించారు. నిశ్శబ్దంగా భక్తులు ఊపిరి బిగబెట్టి ఎంతో ఏకాగ్రతతో స్వామీజీ ప్రసంగాన్ని శ్రవణం చేశారు. వారు ప్రసంగాన్ని ప్రార్థనతో ప్రారంభించారు. పవిత్ర మయిన ఓంకారాన్ని ఉచ్ఛరించారు. ఆ శాంతితరంగాలు అందరి హృదయాలను భగవదనుభూతితో నింపివేశాయి. ఆయన ప్రసంగంలో వాడిన పదాలు అందరికి ఉత్తేజాన్ని కలిగించి, వారి హృదయాలను ఆర్తితో నింపివేశాయి. వారి ప్రసంగం అందరి హృదయాలలో జ్ఞానజ్యోతిని వెలిగించింది. ఇక ప్రసంగాన్ని ఓం తత్సత్ అంటూ ముగించారు. శ్రవణం చేసిన వారందరూ శాంతిని, ఆనందాన్ని వెంట తీసుకువెళ్ళారు.

స్వామీజీతో సమావేశం రంగూన్‌లో చక్కని ఆధ్యాత్మిక వాతావరణాన్ని కలుగజేసింది. అలాంటిది అంతకు పూర్వము వారెన్నడూ ఎరుగరు. అప్పటి నుండి స్వామీజీని, సుశీలాదేవిని కలుసుకోవడానికి, దర్శించుకోవడానికి భక్తులు నిత్యం రాసాగారు. అందువలన వారు క్షణం కూడా తీరిక లేకుండా ఉండేవారు. ఇంటి వద్ద భక్తులకు దర్శనము ఇవ్వటమే కాకుండా స్వామీజీ, సుశీలాదేవి భక్తుల ఆహ్వానం మేరకు చాలా మంది ఇళ్ళకు వెళ్ళి వాళ్ళకు ప్రబోధాలు చేసేవారు. మంత్రదీక్ష ఇచ్చేవారు. ఆ కుటుంబాల వారికి ఉచితంగా శాంతిమిషన్ ఆశయాలను పొందు పరిచిన పుస్తకాలు, కాగితాలు ఇచ్చేవారు.

స్వామీజీ రంగూన్ వెళ్ళటం వలన, శాంతి సందేశాలను అందించటము వలన చాలామంది భక్తుల హృదయాలలో రంగూన్‌లో ఒకనూతన శాంతి కేంద్రాన్ని నెలకొల్పాలి అనే ఆలోచన, సంకల్పము కలిగింది. అతితొందరలోనే సంకల్పం సాకారమయింది. మార్చి 28వ తేదీ చటర్జీ గారి ఇంట్లోనే శాంతి కార్యక్రమాలు ప్రారంభించబడ్డాయి. ప్రారంభోత్సవ మహోత్సవం స్వామీజీ ప్రార్థనతో ప్రారంభ మయి శాంతికేంద్రము ఆశయాలను వివరించటంతో ముగిసింది.

రంగూన్‌లో స్వామీజీ విడిది చేసిన సమయంలో మహమ్మదీయ సాధువు బక్రీబాబాని కలుసుకున్నారు. ఆయన గత నాలుగు సంవత్సరాలుగా రంగూన్‌లోనే నివాసముంటున్నారు. ఆయన సేవాభావంతో పేదప్రజలకు అన్నదానం చేయటం, పవిత్ర జలముతో రోగాలను నయం చేయటం చేసేవారు. ఆయన నిస్వార్థపరుడు, పరమ పవిత్రమయిన వాడు, అంకితభావంతో మానవాళికి సేవలందించేవాడు. ఆయన గురించి తెలుసుకున్న స్వామీజీ, సుశీలాదేవి వారిని కలుసుకోవడానికి

అనుమతి పొందారు. వారిద్దరు ఒకరోజు రాత్రి 8 గంటల సమయంలో బక్రీబాబాని కలుసుకోవటం కోసం వెళ్ళినప్పటికి ఆయన వంటపనిలో నిమగ్నమయి తీరిక లేకుండా ఉన్నప్పటికీ ఎంతో సాదరంగా ఆహ్వానించారు. అతిథి సత్కారాలు చేశారు. పేద ప్రజలందరికి ఆయన స్వయంగా దగ్గరుండి భోజనం వడ్డిస్తున్నారు. ఎంతో ప్రేమతో, భక్తితో వారు చేస్తున్న సేవలను గమనించి స్వామీజీ, సుశీలాదేవి ఎంతో సంతోషించారు. ఆ కార్యక్రమం పూర్తి కావటానికి రాత్రి 11 గంటలు పట్టింది. అప్పుడు బాబా తీరికగా స్వామీజీ వద్దకు వచ్చి విశ్రాంతిగా కూర్చున్నారు. అంతటా నిశ్శబ్దం, ప్రశాంతమయిన వాతావరణంలో అనంతమయిన ఆకాశం కప్పు క్రింద, మిణుకు మిణుకుమని వెలుగులీనుతున్న నక్షత్రాల కాంతిలో పవిత్రమయిన గొప్ప ఆత్మజ్ఞానులు సమావేశమయ్యారు. మౌనమే వారి మధ్య సంభాషణగా మారింది. ఆత్మలు మాత్రం పలకరించుకున్నాయి. ఆ స్థితిలో ఎన్ని గంటల సమయం గడిచి పోయిందో తెలియదు. చివరికి వీడ్కోలు తీసుకునే సమయం ఆసన్నమయింది. ఒకరి భావాలు, ఆలోచనలు మరొకరు మౌనంగానే అర్థం చేసుకున్నారు. కలిసి ప్రార్థనలు చేశారు. ప్రేమగా వీడ్కోలు తీసుకున్నారు.

**హాంకాంగ్ – డి.ఓడి. సిల్వా**

సంవత్సరాలు, నెలలు, వారాలు, రోజుల తరబడి నేను ఒక భారతీయ సాధు మహాత్ముని దర్శనం కోసం తపించిపోతున్నాను. చివరికి నా కోరిక నెరవేరింది. నా ప్రార్థనలు ఫలించాయి. నేను ఓంకార్ స్వామీజీని కల్సి చాలా కొద్ది నిముషాల కాలం గడిపాను అంతే, కాని వారితో నా కలయిక నాకు ఒక నమ్మకాన్ని ఏర్పరిచింది. మా ఇద్దరి మధ్య ఎన్నటికి తెగని అనుబంధము ఏర్పడింది. ఇప్పుడు నేను విశ్వశాంతి కేంద్రము, శాంతి ఆశ్రమము జీవితకాల సభ్యుడిగా మారిపోయాను.

కొద్దిరోజుల క్రితం ఒక భారతీయ వస్త్రవ్యాపారితో మాట్లాడినప్పుడు అనుకోకుండా అతని ద్వారా స్వామీజీ అమెరికా ప్రయాణము మార్గమధ్యంలో హాంగ్‌కాంగ్ వస్తున్నట్లుగా తెలిసింది. దాదాపు ముప్పై ఎనిమిది సంవత్సరాల క్రితం స్వామి వివేకానంద గారిని నేను సిలోన్‌లో కలిసాను. అప్పుడు నేను కాలేజీ విద్యార్థిని, అయినా నేను అప్పటికే సత్యాన్వేషకుడిగా, మతం పట్ల గాఢమయిన విశ్వాసం కలవాడిని. ఇప్పుడు నేను థియోసోఫికల్ సొసైటీ సభ్యుడిని కావడం వలన స్వామీజీని మా మాసుక్ లాడ్జికి వచ్చి గురువారము సాయంత్రము శాంతి సందేశాలను అందించ వలసిందిగా కోరాలని నిశ్చయించుకున్నాను. ఆయన ఎంతో ప్రేమతో అందుకు అంగీకరించారు. 'జీవిత గమ్యము' అనే అంశంపై ప్రసంగించడానికి నిర్ణయించ బడింది. సమయం చాలా తక్కువగానే ఉన్నప్పటికి నేను పత్రికా విలేఖరులను, ముఖ్యమయిన స్నేహితులను, సొసైటీ సభ్యులను ఆహ్వానించాను.



అది చాలా చిన్న ప్రదేశం కావటం వలన సమావేశానికి వచ్చిన వారితో కిక్కిరిసిపోయింది. అందరూ ఎంతో భక్తిశ్రద్ధలతో నిశ్శబ్దంగా స్వామీజీ మరియు సుశీలాదేవి మాటలు విన్నారు.

స్వామీజీ శ్రోతలను అప్పటిదాకా వారు విన్న విషయాలను గుర్తు చేసుకోమని చెప్పారు. బాహ్యంగా విన్న విషయాలను తొందరగా మర్చిపోతాము. కానీ అదే విషయం హృదయాంతరాళాల్లో చొచ్చుకొనిపోయి హృదయానికి హత్తుకొనిపోవటం చాలా ముఖ్యం. అప్పుడే ఆ విషయం వారికి జీవితకాలము గుర్తుండిపోతుంది. అందువలన మనము మనసు లోతుల్లోకి వెళ్ళడానికి ప్రయత్నము చేయాలి తప్ప, ఉపన్యాసాల మీద దృష్టి పెట్టకూడదు. అవి ఎంతగా మనలను ఉత్తేజితులను చేసినా, బాహ్యపరిస్థితులు మనలను ప్రభావితం చేసినప్పటికి మనం ఆత్మను మరిచిపోకూడదు అని వివరించారు.

సర్వత్రా వ్యాపించి ఉండే సర్వేశ్వరుడిని తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. పరమాత్మ ఉనికిని గుర్తించినపుడు ఆయన ప్రతి జీవి హృదయంలో ప్రతిష్ఠితమై ఉన్నాడని అర్థం అవుతుంది. మన లోపల, బయటా, క్రిందా, పైనా, మన చుట్టూ అంతటా అణువణువు లోనూ పరమాత్మ నిండి ఉన్నాడు. ఆయన ఎప్పుడూ మనకంటే భిన్నంగా, వేరుగా దూరంగా లేడు. వెలుగులీనుతున్న మన కళ్ళలో, అంతర్యామిగా మన హృదయంలో ఉన్నాడు. హృదయంలోని ఆత్మస్వరూపాన్ని గుర్తించలేకపోతే ఇక మన జీవితాలకి పరమార్థం ఏముంటుంది? ఆ విషయం అర్థం చేసుకోలేకపోతే మన జీవితాలు వ్యర్థం అవుతాయి.

ఒక్కమాటలో జీవిత పరమార్థము, జీవన గమ్యము గురించి చెప్పాలంటే పరమాత్మను గురించి తెలుసుకోవటమే అని చెప్పాలి. అదే నిజమయిన జీవితము. భౌతికమయిన విషయాలను అతీతమయినది, శాశ్వతమయినది, విశ్వజనీనమయినది. జంతువులకు, మానవులకి ఉన్న తేడా అంతా భగవంతుని ఉనికిని అర్థం చేసుకోవటం లోనే ఉంది. మానవాళికి భగవంతుని తెలుసుకోవటమే పూర్తి పరమార్థంగా జీవిత గమ్యం అని తెలుసుకోవాలి.

మానవ జీవితం ఐదు మెట్లుగా అర్థం చేసుకోవాలి. అవి ఖనిజము, కూర గాయలు, జంతువులు, మానవుడు, దైవదత్తమయిన జీవితము. కొందరు మానవులు కేవలం వారి భౌతికమయిన నామరూపాలకి పరిమితమయి జీవిస్తుంటారు. వారిది మొదటి మెట్టు. మరికొందరు వారి పిల్లలు, ఇతర కుటుంబ సభ్యుల గురించి మాత్రమే ఆలోచిస్తుంటారు. వారిది రెండవ మెట్టు. మరొక రకం మానవులు వారి అభ్యుదయం కోసం, వారి కుటుంబ సభ్యుల కోసం ఇతరుల మీద దాడిచేసి క్రూరంగా జంతువుల మాదిరిగా ప్రవర్తిస్తుంటారు. ఇంకొక రకం వారు కొద్దిగా ఉన్నతమయిన స్థితిని పొందినవారయి ఉంటారు. వీరు తన దేశ ప్రజలందరిని ప్రేమిస్తారు. ఇంక

చివరిగా ఉన్నతోన్నత స్థితిని పొందిన మానవుడు దివ్యత్వాన్ని అనుభవిస్తూ భగవంతునితో ఏకత్వాన్ని పొందుతాడు. అతనికి అన్ని దేశాల ప్రజలు ఒక్కటే, అన్ని మతాలు ఒక్కటే. ప్రపంచమంతా అతనికి తన సొంత కుటుంబము లాగా ప్రజలందరూ తన సొంత కుటుంబసభ్యులుగా అనిపిస్తుంది. అతనికి అందరిలో భగవంతుడే కనిపిస్తాడు తప్ప వేరు భావన కలుగదు.

మనము ఇతరులను ఏ కోవకు చెందుతారు అని తెలుసుకోవడానికి ప్రయత్నించే బదులుగా మనము ఏ కోవకు చెందుతామో మనల్ని మనము సరిగ్గా పరీక్షించి తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. అప్పుడు మనము నెమ్మదిగా ఒక్కో మెట్టు పైకి ఎక్కటానికి ప్రయత్నించి చిట్టచివరికి ఉన్నతమయిన స్థితికి చేరుకోవాలి. జీసస్ క్రీస్తు, బుద్ధభగవానుడు, మహమ్మదు మొదలైన మహాత్ములు మానవుల్లో గొప్ప ప్రవక్తలుగా ఎగిదిన విధంగా మనము బాగా ప్రయత్నించాలి.

అనవసరమయిన విషయాలకి ఎక్కువగా ప్రాధాన్యతనిస్తూ ఉంటారు చాలా మంది కానీ అన్నింటికన్నా అత్యవసరమయిన విషయం ఆత్మ సాక్షాత్కారము, భగవదనుభవము. దీనిని అందుకోవడానికి మనము మన నిత్య జీవిత కార్యక్రమాలను త్యాగం చేయవలసిన పనిలేదు. మనము ఎక్కడ ఉన్నప్పటికీ, ఏ పని చేస్తున్నప్పటికీ అది భగవంతునితో సంబంధం కలిగే ఉంటుంది. చర్చిగాని, దేవాలయము గాని సత్యాన్ని దర్శించడానికి అవసరం లేదు. ఎందుచేతనంటే జీవితము, మతము రెండూ వేరు కాదు. అవి రెండూ ఒక్కటే. అందువలన చర్చి వదిలిన తర్వాత భగవంతుడిని మర్చిపోకూడదు. మనతో పాటుగా మనం ఎక్కడికి వెళ్ళినా దేవుడు మనతోనే ఉంటాడు అని గుర్తు పెట్టుకోవాలి. ఆయన వైభవాన్ని, ఆనందాన్ని, తేజస్సును, ఉనికిని నిరంతరము మనము అనుభవిస్తుండాలి.

మనము భగవంతుడిని తెలుసుకోవాలంటే, భగవదనుభూతిని పొందాలంటే అంతటా, అందరిలో ఆయనని దర్శించాలంటే మనలను మనము భగవంతునికి మనస్ఫూర్తిగా అంకితం చేసుకోవాలి. అప్పుడు మన హృదయంలో సంపూర్ణమయిన శాంతి నెలకొంటుంది. మనము ప్రపంచాన్ని మార్చివేయలేము కానీ మనలను మనము మార్చుకోగలము. ఎప్పుడయితే మన హృదయంలో శాంతిని నెలకొల్పుతామో అప్పుడు ఇతరుల హృదయాలను శాంతితో నింపగలుగుతాము. అప్పుడిక ఆ శాంతి ప్రాంతాలను, దేశాలను దాటి యావత్తు ప్రపంచానికి అందుతుంది. ప్రపంచానికి శాంతిని అందించడానికి ఒకే ఒక మార్గము మనలో వ్యక్తిగత శాంతిని హృదయంలో నిండే విధంగా ప్రయత్నించటమే. మన హృదయము, బుద్ధి, ఆత్మ నిత్యము సత్యము అయిన పరమాత్మ అనుభవముతో నిండిపోతుందో అప్పుడు మనము ఆ అనుగ్రహాన్ని, ఆశీస్సులను మన ఇంటి నుండి మనవారందరికి, దేశానికి ఇంకా యావత్తు ప్రపంచానికి అందించగల్గుతాము.



ప్రార్థన, ధ్యానము, ఆత్మసాక్షాత్కారానికి దారితీస్తాయి. "నిశ్చలంగా ఉండు, అప్పుడే నీ లోని దివ్యత్వాన్ని, భగవతత్త్వాన్ని నీవు తెలుసుకోగలుగుతావు" అని చెప్పబడుతోంది.

ఇంక స్వామీజీ ప్రసంగాన్ని ముగించే ముందు ధ్యాన పద్ధతులను గూర్చి వివరించారు. అక్కడ సమావేశమయిన భక్తులందరిని ఉద్దేశించి ఏ విధంగా ధ్యానం చేయాలో వారితో చేయించారు. ఓంకారాన్ని మూడు పర్యాయాలు ఉచ్చరించి ప్రసంగాన్ని ముగించారు. వింటున్న శ్రోతలు స్వామీజీ ప్రసంగాన్ని మంత్రముగ్ధులయి విన్నారు. వారిలో చాలామంది స్వామీజీని, సోదరి సుశీలాదేవిని వ్యక్తిగతంగా కలుసుకుని మాట్లాడడానికి ఆసక్తిగా ఉండిపోయారు.

మరుసటిరోజు నా స్నేహితుడు హాంగ్‌కాంగ్ దీవిలోని వివిధ దర్శనీయ స్థలాలని స్వామీజీకి చూపించడానికి కారులో తీసుకువెళ్ళాడు. ఆ రోజు అర్ధరాత్రి దాటిన తర్వాత 'ప్రెసిడెంట్ జాఫర్‌సన్' అనే పేరుగల ఓడలో స్వామీజీ, సుశీలాదేవి సీటిల్ వాషింగ్‌టన్ యు.ఎస్.ఎ. బయలుదేరారు. నేను, నా భార్య మరికొందరు స్నేహితులతో కలిసి వారికి వీడ్కోలు చెప్పి వారి ప్రయాణం సుఖంగా జరగాలని సందేశం ఇచ్చి వచ్చాము.

## మన కోసం నడవాలి

**మన నడక**
**లేత కిరణం కావాలి.**
**ఉదయపు వెలుగులులా**
**లేత చిగురుల్లా**
**మన నడక,**
**అలా ప్రారంభం కావాలి.**
**భూమి పొరలలో**
**దాగిన విత్తులా**
**ఆకుల మధ్య చొచ్చుకు వచ్చే**
**పిందెలులా**
**ఉషోదయాన చొచ్చుకు వచ్చే**
**ఉదయపు కిరణాలులా**
**నీ జీవితానికి,**
**నడక అంటే, అంతటి**
**ప్రేమానురాగాలు ఉండాలి**

**శిల్పిని చూసి**
**ఉలికి ఎంతటి ఆరాటమో!**
**ఉలిని చూసి**
**రాయికి ఎంతటి ఆరాటమో!**
**నడిచే జీవితాన్ని చూసి**
**భవితకు అంతటి ఆరాటం,**
**ఉండాలి**
**అప్పుడే**
**మన నడక**
**మరొకరికి**
**లేత కిరణం**
**ఉదయపు కిరణం**
**అవుతుంది**

**-మలిశెట్టి శ్రీనువాస రంగారావు (బన్ను)**

# శ్రీకృష్ణ జన్మాష్టమి

**పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ**

సాధుసంరక్షణకొరకు–దుష్ట సంహారము కొరకు, ధర్మసంస్థాపన కొరకు యుగ యుగమున నేను పుట్టుదును. అని భగవానుడు గీతలో స్పష్టముగ చెప్పెను. మహాభారత యుద్ధములో ధర్మవర్తనులగు పాండవులకు అనేక విధముల అద్భుతముగ సహాయం చేసెను. కర్ణుడు దేవేంద్రుని వద్ద తన కవచకుండలములకు బదులుగా సంపాదించిన శక్తి బాణమును అర్జునునిపై ప్రయోగించకుండా ఘటోత్కచుని సంహరించుటకు విధి లేక ప్రయోగించినందువలన అర్జునుని ప్రాణము కాపాడబడుట కృష్ణ కృపయే.

తన ప్రియ కుమారుడు అభిమన్యుని అక్రమముగా వధించిన సైంధవుని సూర్యాస్తమయంలోపున సంహరింపజాలని యెడల తనే ఆత్మహత్య చేసికొందునని అర్జునుడు ప్రతిజ్ఞ చేసినందున, శ్రీకృష్ణుడు తన దివ్యశక్తిచే సూర్యుడస్తమించినట్లు చూపగా, అంతవరకు దాగియున్న సైంధవుడు సంతోషముతో తల పైకెత్తి చూడగా, అర్జునుడు అది చూచి తన పాశుపతాస్త్రముతో సైంధవుని తలను ఖండించి, శ్రీకృష్ణుని ఆదేశానుసారము ఆ తలను క్రిందపడనీయక సైంధవుని తండ్రి ఒక అరణ్యములో తపస్సు చేసుకొనుచుండగా, వాని దోసిలిలో ఈ శిరస్సు పడునట్లు అర్జునుడు తన అస్త్ర నైపుణ్యముతో బంతివలె ఎగురవేయుచు అచ్చటకు పంపెను. అప్పుడాతడు తన చేతులలో పడిన పుర్రెను క్రిందపడవేయగా అతని తల వెయ్యివ్రక్కలై తన శాపము తనకే తగిలి వెంటనే మృతిచెందిన గొప్ప గాధ భారతములో గలదు. శ్రీకృష్ణ భగవానుని సహాయమెంత అమోఘమైనదో ప్రతివారు గ్రహింపగలరు.

ఎచ్చట దుష్టుల వలన సత్పురుషులకు హాని గల్గుచున్నను ఎచ్చట ధర్మవిరుద్ధమైన పనులు జరుగుచున్నను, అచ్చటచ్చట తాను స్వయంగా సంహరించియు, భీమార్జునులు మొదలగు వీరులచే సంహరింపజేసియు, భగవానుడు ధర్మరక్షణ గావించెను.

శ్రీకృష్ణుడే ఈ ప్రపంచమంతయు వివిధ నామరూపములతో నిండి యుండెనని తెలుసుకొని విశ్వప్రేమ అలవచ్చుకొనవలసి యున్నది. అప్పుడు లోకమంతయు శాంతిమయమగును.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

మనం చేయవలసింది, మనం ఆత్మస్వరూపులమనే సంగతి దృష్టిలో వుంచుకోవడం, దాన్ని మరచిపోయి "మనమే ఈ దేహం–అహం' అనుకుంటాం. ఎడతెగని, అలసటలు లేని ప్రయత్నం చేస్తూ, నిరంతరం లోపలకు వెదుతూ వుండాలి. అంతర్ముఖమై–ఆత్మ సాక్షాత్కారం అయ్యేంతవరకు ఇబ్బందులు వుంటాయి.

**– శ్రీ భగవాన్ రమణమహర్షి**



# గురువాచక కోవై

**మూలం : మురుగనార్** **వివరణ : సాయికృష్ణ**

**(గత సంచిక తరువాయి)**

## గురుమహాత్త్యము

**నీవు సకల సద్గుణములను సంపాదించుకొని యుండవచ్చును, సకల దుర్గణములను నశింపజేసుకొని యుండవచ్చును, సకల సంబంధములను, బంధములను త్రెంచుకొని యుండవచ్చును. శాస్త్రములలో సజ్జనులకై నిర్దేశించబడియున్న తపస్సులు అన్నింటిని చేసియుండవచ్చును! నీ బుద్ధివైభవము కారణముగా, నీవు సాధించిన ఘనకార్యముల కారణముగా నీవు ఎంత గొప్పవాడవు అయినను అయి ఉండవచ్చును! కానీ నీ పురాకృత సుకృత పరిపాకము వలన జ్ఞానగురు సందర్శనభాగ్యము కలిగెడివరకు పూర్ణానందరూపమగు కైవల్యానుభవమును నీవు పొందగలవా?**

సాధకులు పెద్దలమాటల ద్వారా, గురువుల ఉపన్యాసముల ద్వారా, సద్గ్రంథ పఠనము ద్వారా మంచి నడవడికలో ఉండవచ్చును. సుదీర్ఘ సాధనచే తన దుర్గుణాలను పోగొట్టుకొని సుగుణాలను వశం చేసుకొనవచ్చును. శాస్త్రము పరిపూర్ణమయిన వైరాగ్యము కావాలని చెబుతుంది. ఈ లోకంలో, పైలోకంలో భోగాలు అవసరం లేదు అనుకొని సాధన చేయాలి. పరమాత్మ కొఱకు తపించడమే సాధన. నీవు సంపాదించిన జ్ఞానాన్ని నలుగురికి పంచవచ్చును. నీవు ఈ జన్మలో ఎంత గొప్ప వాడవు అయినా నీ పూర్వజన్మపుణ్య పరిపాకము వలన, గత జన్మ పుణ్యము వలన నీకు ఆధ్యాత్మిక మార్గములోనికి ప్రవేశము కలిగింది. ఆశ్రమ దర్శనము, దేవాలయ దర్శనము, గురువు సందర్శన భాగ్యము కలగడానికి గతజన్మ పుణ్యం ఉండాలి లేదా గతజన్మలోని అలవాటు అయినా అయి ఉండాలి. నీవు ఎంతో సాధన చేస్తూ ఉండవచ్చు, ఎంతో జ్ఞానము కలిగి ఉండవచ్చు, జనులు నిన్ను గురువుగా అంగీకరించ వచ్చు, నీకు ఎంతోమంది శిష్యులు ఉండి ఉండవచ్చు, నీవలన ఎన్నో మంచి పనులు జరిగి ఉండవచ్చు. ఎన్ని ఉన్నా గురువు కటాక్షము, అనుగ్రహము నీకు కలగాలి. అప్పుడే నీవు మోక్షమును పొందగలవు. ఎన్ని సాధనలు చేసినా గురువు యొక్క కృప తప్పని సరిగా ఉండాలి.

కావ్యకంఠ గణపతిముని ఎంత సాధన చేసినా, ఎంత జ్ఞానవంతుడయినా, ఎంతమంది శిష్యులు ఉన్నా, శాస్త్ర అధ్యయనం, కోట్లకొలది మంత్రజపం చేసినా ఆయనకు అనుభవం కలుగలేదు. బ్రాహ్మణస్వామి (రమణమహర్షి) తన మౌనం విడచి, గణపతిపుణ్య విశేషము వలన తను అనుగ్రహం ఇచ్చారు. ఆ అనుగ్రహ రూపమే **'నేనెవరు'** అన్న చిన్న పుస్తకముగా రూపొందింది. తపస్సు గురించి భగవాన్

ఇచ్చిన అద్భుత వివరణ తను చదివిన ఏ శాస్త్రములోనూ లేదని గణపతిముని అన్నారు. ఆత్మానుభవం కావాలంటే గుర్వనుగ్రహం తప్పనిసరిగా పొందాలి.

**జీవన్ముక్తుడు, త్రిపుటిభేదములనంతము చేసినవాడు, ఏకాత్మ ప్రత్యయ సారముగా ప్రకాశించెడివాడు అయిన సద్గురుని దివ్యానుగ్రహమును ప్రప్రథమముగా మనము పొందవలయును. లేనిచో పరమపురుషార్థప్రదము, పరమానందరూపము అయిన ముక్తి వైభవోపేత జీవనమును భగవచ్చరణ ద్వంద్వచ్ఛాయ యందు పొందుట, పొంది అట్టి దివ్యజీవితమును గడుపుట అసంభవమయిన విషయము.**

మనకు కైవల్యమయిని ఆనందం కలగాలి. త్రిపుటిని (చూచేవాడు చూడబడేది చూపు) జ్ధానమయంచేసుకుంటే జగత్తు బ్రహ్మమయం అవుతుంది. ఈ జ్ఞానము గురువు యొక్క ఆశీర్వాదము, అనుగ్రహము వలననే కలుగుతుంది. గురువు అనుగ్రహ భాషణం వలననే జ్ఞానం కలిగి ఆత్మానుభవం కలుగుతుంది. గురు అనుగ్రహమే మోక్షమునకు ఆదికారణము.

**హరి ఓం తత్సత్**

### స్వామి అనుభవానంద వారి బ్రహ్మానుభూతి అను గ్రంథము నుండి

నా మిత్రునకు ఒక కుమార్తె గలదు. ఆ రోజులలో ఆమె వయస్సు పది సంవత్సరములు ఉండవచ్చును. ఒకనాడు ఆమె నిష్కారణముగా ఏడ్వ మొదలిడెను. ఇంటిలోని జనులు, చుట్టుప్రక్కల ఉండే జనులు కూడ చాల ఓదార్చి నచ్చచెప్పినారు. అమ్మాయీ! నీవు ఏల ఏడ్చుచుంటివి? అని వారందరు ప్రశ్నించగా, ఆ అమ్మాయి ఏమీ చెప్పలేదు. ఆమె ఆ విధంగా ఆపకుండగా ఏడుస్తూనే ఉండెను. నీవు దేనిని కోరితే అదినీకు లభిస్తుంది; కాని, ఎందుకు ఏడుస్తున్నావు? కనీసం అదైనా చెప్పు. అని నేను అడిగితిని. అపుడా అమ్మాయి కొంత కుదుటపడి, ఇట్లు చెప్పెను; నావద్ద తొంభైఎనిమిది రూపాయలు ఉన్నాయి. నాకు ఇంకో రెండురూపాయలు కావాలి.

అపుడా అమ్మాయికి రెండు రూపాయలనీయగానే ఏడుపు మానేసింది. కాని, ఆ రెండురూపాయలు లభించగానే ఆ అమ్మాయి దుఃఖము అంతమైనదా? లేదు. ఆమెకు వేలు మాత్రమే కాదు–లక్షలు లభించినా, ఇంకా కావాలి. ఆమె ఇప్పటికి జీవించియేయున్నది. ఇది కేవలము ఒక అమ్మాయి కథ మాత్రమే కాదు. ఇది సంసారియగు మానవుని జీవనము యొక్క ఒక చిత్రము. పెద్దవారు, ముసలి వాళ్ళుకూడ, ఇంకా కావాలి, ఇంకా కావాలి అనే వ్యామోహములో పడి లేరా? వాసనాపూర్తిలోని రసమే బంధమునకు హేతువు. విషయములను (భోగవస్తువులను) సంపాదించి, అనుభవించుటలో సుఖము గలదు అనే బుద్ధినుండి మాత్రమే బంధము ఉదయించును.



# వాల్మీకి మహర్షి విరచిత ఆనంద రామాయణము

(గత సంచిక తరువాయి) **పరిష్కర్త : స్వామి సత్యాత్మానంద**

దీ్వపే తాం పేటికాం స్థాప్య సంగ్రామం రిపుణాఽకరోత్ ।
ఏతస్మిన్నంతర నౌకాఖండం తన ద్వీపమాగతమ్ ॥ **50**

తదాతౌ మంత్రినృపతీ ద్వీపం తమారురుహతుః ।
తత్ర తాం పేటికాం దృష్ట్వా సముద్ఘాట్యాతివిస్మితౌ ॥ **51**

తస్యాం దృష్ట్వాఽథ కౌసల్యాం జ్ఞాత్వా వృత్తం పరస్పరమ్ ।
తయా ముహూర్తసమయే ద్వీపే దశరథో నృపః ॥ **52**

గాంధర్వాఖ్యం వివాహం చ చకార ముదితాననః
తతో రాజాఽథ కౌసల్యా సుమంత్రో మంత్రిసత్తమః॥ **53**

త్రయః స్థిత్వా పేటికాయాం తద్ద్వారం పిదధుః పునః ।
తిమింగిలో రిపుం జిత్వా చకారాస్యే తు పేటికామ్॥ **54**

లంకాయాం రావణశ్చాపి సమాహూయ విధిం పునః
ఉవాచప్రహసన్ వాక్యం సభాయాం సంస్థితస్సుఖమ్॥ **55**

విధే తవ మృషా వాక్యం రావణేన మయా కృతమ్ ।
హతో ధశరథస్తోయే కౌసల్యా గోపితా మయా ॥ **56**

తద్రావణవచః శ్రుత్వా సభాయాం పద్మసంభవః
దీర్ఘస్వరేణ ప్రోవాచ ఓం పుణ్యాహమితి స్ఫుటమ్॥ **57**

రావణః సంభ్రమాత్ ప్రాహ కిమిదం వ్యాహృతం త్వయా।
విధిః ప్రోవాచ లగ్నం తు జాతం ధశరథస్య హి ॥ **58**

తదావిధిం మృషా కర్తుం దూతాన్సంప్రేష్య సాదరమ్।
తిమింగిలాత్సమానీయ పేటికాం బ్రహ్మణోఽంతికే॥ **59**

సముద్ఘాట్య దదర్శాసౌ తత్ర తస్యాం దశాననః।
తదాఽతిచికితః క్రుద్ధస్తాన్ హతుం ఖడ్గమాదదే ॥ **60**

తదాఽతిసంభ్రమాద్వేధా రావణం వాక్యమబ్రవీత్ ।
కిం కరోషి దశాస్య త్వం మాఽధునా సాహసం కురు ॥ **61**

కౌసల్యైకాస్థాపితాఽస్యాం పేటికాయాం త్వయా పురా ।
త్రయస్తత్ర తు సంజాతా భవిష్యంత్యత్రకోటిశః ॥ **62**

భవిష్యతి వధస్తేఽద్య రామోఽత్రైవ జనిష్యతి ।
సాహసం కురు మాఽద్యైవ సత్యాయుషి దశానన ॥ **63**

ఒక ద్వీపమున ఆ పెట్టెనుంచి, పగతో పోరాడుచుండెను. అంతలో విరిగిన ఆ నౌకాశకలము ఆ ద్వీపమును జేరెను. (50), అప్పుడా మంత్రియును, రాజును ఆ ద్వీపమునెక్కిరి. అచ్చటనున్న ఆ పెట్టెనుచూచి, తెరచి ఆశ్చర్యమొందిరి. (51), అందులో కౌసల్యనుజూచి అన్యోన్యముగా తమతమ వృత్తాంతములను చెప్పుకొనిరి. (52), అపుడా దశరథమహారాజు, ముహూర్తసమయంలో గాంధర్వవిధి ననుసరించి కౌసల్యను వివాహమాడెను. (53), ఆ తరువాత ఆ ముగ్గురు మరల అదే పెట్టెలో దూరి, లోపల ద్వారమును బిగించుకొనిరి. ఆ తిమింగలమూ తన శత్రువును జయించి, ఆ పెట్టెను తన నోట పెట్టుకొనెను. (54), లంకయందు రావణుడు మరల బ్రహ్మదేవుని పిలిపించి, "ఓయీ విధీ! నీమాట నాచే అసత్యము గావింప బడినది. దశరథుడు నీటిలో చంపబడెను. కౌసల్య నీటియందు దాచబడె," నని సభలో నవ్వుచూ పలికెను. (55, 56), అందుకు బ్రహ్మదేవుడు ఉచ్చైశ్వరముతో "ఓం పుణ్యాహం" అని శుభకర్మారంభ సూచకముగ మంగళ వాక్యమును ఉచ్చరించెను. (57), దానిని విన్న రావణుడు ఆశ్చర్యముతో ఏమని చెప్పెదవని అధిక్షేపించెను. అపుడు బ్రహ్మ "దశరథ మహారాజుకు వివాహలగ్నము నెరవేరినది గదా!" యని చెప్పెను. (58), వెంటనే రావణుడు విధిని ధిక్కరించదలచి, దూతలను పంపి, తిమింగిలము నుండి ఆపెట్టెను తెప్పించి, బ్రహ్మ సన్నిధిలో ఆ పెట్టెను తెరవగా వారు కనిపించిరి. (59, 60) రావణుడు క్రోధముతో ఆ మువ్వురిని చంపుటకు సిద్ధపడి కత్తిని చేబూనెను. (61), అపుడు బ్రహ్మదేవుడు సున్నితముగ రావణునితో ఇట్లనెను. "ఓయీ రావణా! ఇపుడు సాహసించవద్దు. ముందు నీవు ఈ పెట్టెలో కౌసల్యను పెట్టితివి, ఇపుడందులో ముగ్గురు ప్రత్యక్షమయ్యారు. ఇదేవిధముగ కోట్లకొలది కాగలరు. (62), నీవు వీరిని చంపితివా?! ఇపుడే రాముడు పుట్టును. వీరికి ఆయుర్బలముంది గనుక ఇపుడే సాహసింపకుము. (63),

**(సశేషం)**

మనము చేయు ప్రతికార్యమందును పరమాత్మయే స్వయముగా వ్యక్తమగు చుండును. ఆ సత్పదార్థమే ఈ ప్రపంచ వస్తువుల రూపమున సఫలమగుచున్నది. అహంకార మమకారములను మరచి అన్నిటికిమూలమగు ఆత్మను సదా జ్ఞపికియందుంచు కొనుము. **– స్వామి ఓంకార్**

మూలశక్తియైన పరమాత్మలో నుంచి విడివడిన నిముషమందు నీకిక ఆశలేదు. దైవజ్యోతిలో మఙ్జడవుగా, బ్రహ్మైకశ్రీని పొందు. ఆ దివ్య శిఖరాల నుంచి క్రిందికి జారవద్దు. సత్యసాక్షాత్కారానుభూతి పొందు. అయస్కాంత సంపర్కముచేత, ఇనుప ముక్క అయస్కాంతమైన విధంగా నీవు ఆత్మ సంపర్కము చేత ఆత్మశక్తి దీపితుడవుతావు. **– స్వామి రామతీర్థ**



# శ్రీ తులసీ సర్వస్వము

జి.వి.యస్.సుబ్రహ్మణ్యశాస్త్రి

## ఎఫ్. మనము చేయు పూజలో తులసియొక్క ఉపయోగము

భక్తులకు భగవంతుడైన విష్ణువు ఎంత ఆరాధ్యుడో, తులసి కూడ అంతటి ఆరాధ్య దేవత అయినది. అనాది కాలము నుండి ఈ తులసి విష్ణువుకు నిత్య సహచరి అయినది. ఈ తులసి గోలోకములో కృష్ణునితోపాటు అతని దేవిగా ఉండెడిది. శ్రీకృష్ణుని లీలావిభూతిలో శ్రీరాధాదేవితో పాటుగా శ్రీకృష్ణుని సహచరిగా ఉండెడిది. ఆమె ఒకసారి బృందావనములో గోపికగా (బృందగా) అవతరించినది అందువలననే ఆ ప్రాంతమునకు 'బృందావనము' అని పేరు వచ్చినది.

భగవంతుడైన విష్ణువునకు ప్రియమైనదియును, శ్రీకృష్ణునకు గోలోకములో సహచరియును, అగు తులసి, భగవదారాధనము చేసి, భగవంతునికే తన సర్వస్వమును సమర్పింపదలచుకొన్నది కనుకను, ఆమె సహజముగా సర్వ సంపూజ్యమై మనము చేయు నిత్య పూజలలో పూజార్హపదార్థముగా మారినది. సాలగ్రామార్చన చేయవలెననినను, విష్ణ్వారాధనము చేయవలెనన్నను, భగవంతుని వివిధావతారములను అర్చింపవలెనన్నను, పితృకార్యములను చేయవలెనన్ననూ యజ్ఞ యాగాదులను నిర్వర్తింపవలెనన్నను, నిత్య నైవేద్యమును సమర్పింప వలెనన్నను, ఇతర దేవి, దేవతోపాసనములు చేయవలెనన్నను, తులసియొక్క ఉపయోగము తప్పనిసరి అయినది. అని పెద్దలు పేర్కొనుచుందురు. ఆయా పూజలలో తులసిని ఉపయోగించుట వలన ఆయా దేవతల అనుగ్రహములను త్వరగా పొందవచ్చును. అని వివిధ పురాణములు పేర్కొనినవి.

తులసీదళమును వేయనిదే పదార్థము ప్రసాదము కాదు. అని ఇంతకుముందు తెలిసికొంటిమికదా. అందువలన నిత్యపూజలలో తులసియొక్క అవసరము ఎంతైననూ ఉన్నదని వేరుగా చెప్పనక్కరలేదు కదా.

ఈ తులసి, శ్రీకృష్ణునకు అత్యంత ప్రియమైనది. కనుకనే తులసీదళములను వేసిన ఆహారమును ఆ దేవదేవుడు ప్రసాదముగా మార్చుచున్నాడు.

శ్రీకృష్ణుని ఆనంద స్వరూపిణిగా సురాసురులు, క్షీరసముద్రమును మథించి నప్పుడు ఆ క్షీరసాగరమునుండి ఈ తులసి ఉద్భవించుటచే (జన్మించుటచే) తాను పవిత్రయై, భగవత్పూజాయోగ్యమైనదని పురాణములు పేర్కొనుచున్నవి.

## జి. తులసీదళములతో పూజ

**శ్లో॥ త్వదంగ సంభవైః పత్రైః పూజయామి యథా హరిమ్ ।**
**తథా కురు పవిత్రాంగి ! కలౌ మలవినాశిని ॥**

తా॥ కలికాలమునందలి పాపములను నశింపజేయుదానా! పవిత్రములైన అంగములు కలదానా! ఓ తులసీ! నేను నీ నుండి పుట్టిన దళములతో శ్రీహరిని పూజించునట్టి అవకాశమును నాకు కలిగింపుము.

## హెచ్. గృహమునందు తులసీసేవావైశిష్ట్యము

**శ్లో॥ తులసీ యస్య భవనే ప్రత్యహం పరిపూజ్యతే ।**
**తత్ గృహం నోపసర్పంతి కదాచిత్ యమకింకరాః ॥**

**(స్కాంద పురాణము)**

తా॥ ఎవనిఇంటిలో తులసీదేవి ప్రతిదినము సేవింపబడుచుండునో ఆ ఇంటిని ఎన్నడునూ యమకింకరులు దరిచేరలేరు అని స్కాందపురాణము పేర్కొనుచున్నది.

**శ్లో॥ యద్ గృహే నాస్తి తులసీ సాలగ్రామశిలార్చనే ।**
**శ్మశానసదృశం విద్యా త్తద్ గృహం శుభవర్జితమ్ ॥**

తా॥ సాలగ్రామశిలను పూజించునపుడు ఏ ఇంటిలో తులసి ఉపయోగింప బడదో ఆ ఇల్లు ఎట్టి శుభమునకు నోచుకొనని శ్మశానము వంటిదగును.

**శ్లో॥ తులసీంవినా యః క్రియతే న పూజా**
**స్నానం న త ద్య త్తులసీం వినా కృతమ్**
**భుక్తం న త ద్య త్తులసీం వినా కృతం**
**పీతం న త ద్య త్తులసీం వినా కృతమ్ ।**

తా॥ తులసి లేకుండా చేసిన పూజ పూజ కాదు. తులసి లేకుండా చేసిన స్నానము స్నానముకాదు. తులసి లేకుండా భుజించిన ఆహారము భోజనము కాదు. తులసి లేకుండా త్రాగిన పానీయము పానీయమే కాదు.

**(బృహన్నారదపురాణములో యజ్ఞధ్వజోపాఖ్యానము నుండి)**

## ఐ. తులసితో పూజ చేయుట వలన కలుగు ఫలితములు

**శ్లో॥ తులసీదళపూజాయా మయా వక్తుం న శక్యతే ।**
**అత్యంతవల్లభా సా హి సాలగ్రామాఖ్య శ్రీహరేః ॥**

**(పద్మ పురాణము)**

తా॥ సాలగ్రామరూపముతోను, అదే పేరుతోను, ఉండు హరిని తులసీ దళములతో పూజించుటచేత కలుగు ఫలితమును చెప్పుట చేతగాదు. తులసి విష్ణువునకు చాలా ఇష్టమైనది.

**శ్లో॥ పాతివ్రత్యేన బృందా సా హరి మారాధ్య కర్మణా ।**
**పూర్వ జన్మని సా లేభే కృష్ణసంయోగ ముత్తమమ్ ॥**

తా॥ బృందాదేవి తపస్సు చేసి, తన పాతివ్రత్య మహిమచేత పూర్వజన్మము నందలి కర్మవశమున ఉత్తమురాలై, కృష్ణునితో సంయోగమును పొందినది.



## జె. తులసీపూజామాహాత్మ్యము

**శ్లో॥ శ్రవణాద్వాదశీయోగే సాలగ్రామశిలార్చనే ।**
**య త్ఫలం సంగమే వృత్తం తులసీపూజనేన తత్ ॥**

**(స్కాంద పురాణము)**

తా॥ శ్రవణానక్షత్రముతో కూడిన ద్వాదశి తిథినాడు సాలగ్రామశిలను త్రివేణి సంగమపవిత్ర తీర్థమునందు అర్చించిన వానికి ఎంత ఫలము వచ్చునో, ఇంటిలోనే ఉండి, శ్రీతులసిని పూజించినవానికి అంతటి సత్‌ఫలితము వచ్చును. అని స్కాంద పురాణములో ప్రకటించినది.

## కె. తులసీపూజ అశ్వమేధ ఫలము నిచ్చును

**శ్లో॥ తులసీదళమాల్యేన విష్ణు పూజాం కరోతి యః ।**
**పత్రేపత్రే ఽశ్వమేధానాం శతానాం లభేత్ ఫలమ్ ॥**

**(గరుడ పురాణము)**

తా॥ తులసీదళములతో గాని మాలలతో గాని ఎవడు విష్ణువును పూజించునో అతడు పూజించిన ప్రతిదళమునకు ఫలితముగా నూరు అశ్వమేధ యాగములు చేసిన పుణ్యమును పొందును.

## ఎల్. తులసీదళముతో విష్ణువును తప్ప ఇతర దేవతలను పూజింపరాదు

**తులసీదళ మాదాయ యో ఽన్యం దేవం ప్రపూజయేత్ ।**
**బ్రహ్మహా స హి గోఘ్నశ్చ స ఏవ గురుతల్పగః ॥**

**(వాయు పురాణము)**

తా॥ తులసీదళమును చేతితో పట్టుకుని విష్ణువును కాక ఇతర దేవతలను ఎవడు పూజించునో వాడు, బ్రహ్మహత్యను చేసిన వానికి కలుగు పాపమును పొందుటయే, కాక గురుభార్యతో సంగమించినవానికి కలుగు పాపము కూడ కలుగును అని వాయుపురాణము పేర్కొనుచున్నది. తులసిని విష్ణుపూజ యందు తప్ప ఇతర దేవతల పూజకు ఉపయోగింపరాదని భావము.

ముందు అజ్ఞానము, తరువాత జ్ఞానము మానవునకు ఆత్మ సాక్షాత్కారము కలిగినపుడు అతడు జ్ఞానాజ్ఞానములకు రెంటిని అతిక్రమించియే యుండును. ఒక దృష్టాంతము, నీ పాదమునందు వాడియైన ముల్లు గ్రుచ్చుకొన్నప్పుడు వానిని తీసివేయుటకై నీకు మఱియొకముల్లు కావలయును. మొదటిముల్లు నూడదీసిన తరువాత నీవు రెండింటిని పాఱవేయుదువు కదా! **– శ్రీ రామకృష్ణ పరమహంస**

భగవంతుడొసగిన జీవితకాలమును ఒక్కక్షణమైనను వ్యర్థపరచక జాగ్రత్త గలిగి ఉపయోగపరచు చుండినమాత్రమే ఈ జన్మలోనే తరించి ఆత్మ శాంతిని, దైవప్రాప్తిని పొందగలుగుదువు. **– శ్రీ మలయాళస్వామి**

# ఆహారమే మనస్సుగా మారుతుంది

**రచన, కూర్పు : అమిరపు నటరాజన్**

ఉద్దాలక మహర్షి తన బోధనను కొనసాగిస్తూ, కుమారుడైన శ్వేతకేతువుకి ఆహారం ఏ విధంగా మనస్సుగా మారుతుందో ప్రయోగపూర్వకంగా నిరూపించిన వైనాన్ని మనం ఈ కథలో చదువవచ్చు. ఉద్దాలకుడు శ్వేతకేతువుకు ఇలా వివరించాడు.

"కుమారా! పెరుగును చిలికినప్పుడు దానిలోని సూక్ష్మమైన పదార్థం పైకి లేచి వెన్నగా ఏర్పడుతుంది. అదే విధంగా, మనం తిన్న ఆహారంలోని సూక్ష్మాతి సూక్ష్మమైన అంశం పరిణామం చెంది మనస్సుగా ఏర్పడుతుంది. నాయనా! ఆ విధంగా, మనస్సు ఆహారం చేత, ప్రాణం నీటి చేత, వాక్కు అగ్ని చేత ఏర్పడతాయి".

కుమారుడైన శ్వేతకేతువు ఇలా అన్నాడు: "మహాత్మా! దయచేసి నాకు ఇంకా బోధించండి!"

"అయితే విను! ఒక మనిషిలో పదహారు భాగాలుంటాయి. పదిహేను రోజులు (ఎటువంటి ఆహారం) తినవద్దు. కానీ నీకు కావలసినంత నీరు త్రాగు. ప్రాణం నీటి వలన కలుగుతుంది కాబట్టి నీరు త్రాగుతూ ఉంటే ప్రాణం పోదు."

తండ్రి ఆజ్ఞ మేరకు శ్వేతకేతువు పదిహేను రోజులు ఏ ఆహారం తినకుండా ఉన్నాడు. ఆ తర్వాత తన తండ్రి వద్దకు వచ్చి, "తండ్రీ! నన్ను ఏమి వల్లించ మంటారు?" అన్నాడు.

ఉద్దాలకుడు: "ఋక్, యజుర్, సామ వేదాలను వల్లించు!"

శేత్వకేతువు: "అవి నాకు గుర్తుకు రావడంలేదు" (అతడు వేదాలను జ్ఞాపకం చేసుకోలేకపోయాడు).

ఉద్దాలకుడు: "కుమారా! బ్రహ్మాండమైన అగ్ని మండిపోగా మిగిలిపోయిన మిణుగురు పురుగు పరిమాణం కలిగిన నిప్పుకణిక ఎక్కువగా జ్వలించే శక్తిని కలిగి ఉండదు. అదే విధంగా నీలోని పదహారు భాగాలలో మిగిలిన ఒక భాగంవల్ల నీకు వేదాలు గుర్తుకు రావు. ఇప్పుడు ఆహారం తీసుకుని ఏమి జరుగుతుందో చూడు! అప్పుడు నేను చెప్పినది నీకు అర్థం అవుతుంది."

శ్వేతకేతువు ఆహారం తీసుకుని తిరిగి తండ్రి వద్దకు వచ్చాడు. అప్పుడు అతడికి అన్నీ చక్కగా గుర్తుకువచ్చాయి. తండ్రి ఏది అడిగినా వల్లించగలిగాడు.

ఉద్దాలకుడు: "కుమారా! బ్రహ్మాండమైన అగ్ని మండిపోగా మిగిలిన మిణుగురు పురుగు పరిమాణం కలిగిన నిప్పుకణికను, మళ్ళీ గడ్డివేసి ఏ విధంగా మండించవచ్చో, అలా నీలోని పదహారు భాగాలలో మిగిలిన ఒక భాగాన్ని, ఆహారాన్ని అందించడం ద్వారా తిరిగి జ్వలింపచేయవచ్చు. అందువల్లనే నీవు వేదాలను జ్ఞాపకం చేసుకో



గలిగావు. కాబట్టి, కుమారా! మనస్సు ఆహారం నుంచి, ప్రాణం నీటి నుంచి, వాక్కు అగ్ని నుంచి ఏర్పడతాయి."

అప్పుడు శ్వేతకేతువుకు తండ్రి చెప్పినది అర్థమయింది.

ఈ విధంగా ఉపనిషత్తుల కాలంలోనే మన పూర్వీకులు విషయాలను శాస్త్రబద్ధంగా, (సైంటిఫిక్‌గా) ప్రయోగం ద్వారా పరీక్షించి తెలుసుకున్నారు. అవే ప్రయోగాలను మళ్ళీమళ్ళీ చేసినా అవే ఫలితాలను తిరిగి రాబట్టవచ్చునని కూడా వారు మనకు తెలియజెప్పారు. ఆ విధంగా మన సనాతన ధర్మం ఆధునికశాస్త్ర విజ్ఞానానికి భయపడదు. ఆధునికశాస్త్ర విజ్ఞానంలో వచ్చే నూతనమైన ఆవిష్కరణలు మన ధర్మాన్ని మరింత బలోపేతం చేస్తాయే కానీ దానిని నాశనం చేయలేవు.

కవిత

## అమృతత్త్వం సాధించు

శాంతి

జన్మకు కర్మకారణం
కర్మఫలం తప్పదు
ఒకే జిందగీ అయితే
ఎలా తీరుతుంది రుణం?

రాగద్వేషాలు
ప్రగతికి అవరోధాలు
పురుషార్థాలు
సుగతికి సోపానాలు!

శరీరం ఆత్మకు ఉపాధి
కట్టుకున్న బట్టలా
చిరగడం దాని స్వభావం
ఆత్మచైతన్యం అవినాశి!

కర్మ నశించేదాకా
పునర్జన్మ తప్పనిసరి
ఉన్నది ఒకే ఒకదారి
ఆధ్యాత్మిక రహదారి!

సంస్కారం ఆత్మబలం
శరీరం కర్మానుసారం
పరోపకారం పుణ్యం
పరపీడనం పాపం!

వర్షాలు కురవకముందు
సరుకులు దాచుకోవాలి
ఈ జన్మాంతం వరకు
పవిత్రంగా జీవించాలి!

ఉత్తిష్ఠ ! జాగృత!
తారత మంత్రం
శ్రద్ధగా జపించు
అమృతత్త్వం సాధించు!

"వి.ఆర్.రావు"

లేప్రాయములో యెండచే వాడిన పైరయినచో మరల వర్షము కురిసినప్పుడు చక్కగపెరిగి మంచి ఫలితమిచ్చును. నీడలో గల పైరైన అంత ఫలితమివ్వజాలదు. అలాగున మంచి గురుశిక్షణము నొంది వ్రతధర్మ నిష్ఠ గలవారికి అఖండైక జ్ఞానము కలుగును. లేనివారి జ్ఞానము సామాన్యముగానే వుండును.

– శ్రీ మలయాళస్వామి

# 1-వెలకట్టలేనిది?

(పూజ్యగురుదేవ్ స్వామీ చిన్మయానందగారు, పూజ్య మాతాజీ స్వామినీ శారదాప్రియానందగారు ఆంగ్లములో బాలలకోసం రచించిన 'తరంగిణి' అనే 11 పుస్తకముల స్రవంతిలో, 2వ పుస్తకాన్ని, విశ్రాంత ఆంగ్ల అధ్యాపకులు శ్రీ బొల్లినేని కోటేశ్వరరావు గారి అనువాదముతో మీకు అందిస్తున్నాము)

ఒకప్పుడు ఓ నగర శివార్లలో ఓ మహాత్ముడుండేవాడు. ఆయన దగ్గర నమ్మకంగా పనిచేసే ఓ సేవకుడున్నాడు. ఓ రోజు ఆ సేవకుడు ఆ మహాత్ముని సమీపించి, తనకు మంత్రోపదేశం చేయమని అభ్యర్థించాడు. అతని సేవకు సంతసించిన ఆ మహాత్ముడు, అతనికి ఓ శుభ ఘడియలో మంత్రోపదేశం చేశాడు. ఆయన శిష్యుని చెవిలో నెమ్మదిగా మంత్రం చెప్పి, తరువాత ఆ మంత్రం చాలా రహస్యమనీ, దానిని ఎవ్వరికీ చెప్పద్దనీ, శిష్యుని ఆదేశించాడు. ఆ ప్రకారమే ఆ శిష్యుడు, తన ప్రక్కనున్న మనిషికి కూడా వినబడనంత చిన్నగా మంత్రజపం చేసుకునేవాడు.

ఒకరోజు ఆ సేవకుడు అక్కడికి సమీపంలోని నదిలో స్నానం ముగించుకుని, ఒడ్డునున్న చెట్టుక్రింద కూర్చుని, గురువుగారు ఇచ్చిన మంత్రాన్ని చాలాసేపు నిశ్శబ్దంగా జపించాడు. ఆ సమయంలో అక్కడికి చాలామంది భక్తులు వచ్చి, ఆ నదిలో స్నానం చేస్తూ బిగ్గరగా రామనామాన్ని ఉచ్చరిస్తున్నారు. ఈ శిష్యుడు అది విని ఆశ్చర్య పోయాడు. తన గురువు తనకు ఉపదేశించిన మంత్రమూ రామనామమే. మరి ఆయన దానిని ఎందుకు గోప్యంగా ఉంచమన్నారు? వీరేమో పెద్దగా అంటున్నారు కదా?ఈ ఆలోచనతో, అతనికి ఏకాగ్రత చెదరి, నేరుగా గురువు దగ్గరకు వెళ్ళి, "గురువర్యా, మీరు నాకు మంత్రోపదేశం చేసి, అది చాలా రహస్యమని చెప్పారు కదా. కానీ ఈరోజు నదీస్నానం చేస్తున్న చాలామంది అదే మంత్రాన్ని ఎంతో బిగ్గరగా జపిస్తున్నారు. మరి ఆ మంత్రం రహస్యమని నాకు ఎందుకు చెప్పారు?" అని అడిగాడు.

గురువు నవ్వి, తన పెట్టెలోనుండి మెరుస్తున్న ఒక రాయిని తీసి శిష్యునికి ఇచ్చి, "దీనిని నగరానికి తీసుకువెళ్ళు, రకరకాల వ్యక్తులకు చూపించు. వారు దీనిని ఎంతకు కొంటారో వాకబు చెయ్. కాని దీనిని ఎవ్వరికీ అమ్మవద్దు. వారు ఇవ్వజూపిన ధరను మాత్రం తెలుసుకుని, మళ్ళీ వెనుకకు జాగ్రత్తగా తీసుకు రా," అన్నాడు.

ఆ శిష్యుడు మెరుస్తున్న ఆ రాయి తీసుకుని, బజారుకు బయలుదేరాడు. త్రోవలో ఓ కూరగాయల వ్యాపారిని చూసి, అతనికి ఈ రాతిని చూపుతూ, "ఎంతకు కొంటావ్?" అని అడిగాడు. ఆ వ్యాపారి దానిని అటు ఇటు త్రిప్పిజూసి, "ఇదేమీ



పెద్దగా ఉపయోగపడే వస్తువేమీ కాదు. అప్పుడప్పుడూ నాకు కూరగాయల తూకానికి ఉపయోగపడుతుంది. కావాలంటే ఒక సేరు వంకాయలిస్తాను." అన్నాడు. శిష్యుడు ఆ వ్యాపారికి కృతజ్ఞతలు తెలిపి, ఆ రాయిని తీసుకుని, ముందుకు సాగాడు.

తరువాత అతను ఓ కజ్జలు అమ్మేవానికి ఆ రాయిని చూపించి, "ఎంతకు కొంటావ్?" అని అడిగాడు. అతను దానిని జాగ్రత్తగా పరిశీలించి, బాగా మెరుస్తున్నదనీ, తన కుమారునికి ఆట వస్తువుగా పనికి వస్తుందని, తాను దానికి ఎనిమిది మణుగుల కజ్జలిస్తానని అన్నాడు. శిష్యుడు ఆ రాతిని తిరిగి తీసుకుని, బజారుకు చేరుకున్నాడు.

అలా ఓ బియ్యపు వ్యాపారికి ఆ రాతిని చూపించాడు. అది నకిలీ వజ్రంలా ఉన్నదని అతనన్నాడు. ఏమైనా దానిని కంఠహారంలో ఉపయోగించువచ్చు గనుక తాను దానికి ఓ బియ్యపు బస్తా ఇస్తానన్నాడు. శిష్యుడు మళ్ళీ ఆ రాతిని వెనక్కు తీసుకుని, ముందుకు సాగాడు.

ఈ పాటికి ఆ శిష్యునికి నిజంగా ఆ రాయి విలువ ఎంత ఉంటుందా? అనే కుతూహలం పెరిగే ఉంటుంది. అతను బంగారు పనివాని దగ్గరకు వెళ్ళి, ఆ రాయిని చూపించాడు. అతడు దానిని సూక్ష్మంగా పరిశీలించి, దానికో వెయ్యి రూపాయలిస్తా నన్నాడు. దానికి ఆశ్చర్యపడిన శిష్యుడు అక్కడినుండి ఓ వజ్రాల వ్యాపారి వద్దకు వెళ్ళాడు. అతడు దానిని చూచిన వెంటనే ఆశ్చర్యంతో, "ఈ వెలకట్టలేని వజ్రం నీకెక్కడ దొరికింది? నా ఆస్తినంతా అమ్మినా నేను దీనిని కొనలేను. మన పట్టణంలో ఎవ్వరూ దీనికి విలువనే కట్టలేరు. నీవు తొందరపడి దీనిని ఈ చిన్న ఊరిలో అమ్మవద్దు. పెద్ద నగరానికి వెళ్ళు, అక్కడ నీకు దీనికి నిజమైన ఖరీదు దక్కవచ్చు," అన్నాడు.

ఎంత అద్భుతం! ఈ రాయి విలువ మనిషి, మనిషికి మారిపోతోంది! ఆ శిష్యుడు, ఆ వ్యాపారికి కృతజ్ఞతలు తెలిపి, ఆ రాయిని తిరిగి తీసుకుని తన గురువు వద్దకు వచ్చాడు. దానికి ఎవరెవరు ఎంతెంత ఇస్తామన్నది అంతా తన గురువు తెలిపాడు.

ఆ గురువు తలాడించి శిష్యునితో, "రామనామ విషయం కూడా ఇంతే, అందరికీ రామనామం తెలిసిఉండవచ్చు, కానీ నిజమైన విలువ తెలిసినవారెవరు? ఈ రాయి విలువని ఆ వజ్రాల వ్యాపారి గుర్తించినట్లు, నిజమైన సాధకుడు నిరంతర ధ్యానంతో మాత్రమే రామనామ విలువను తెలుసుకోగలడు. మిగతా వారికి ఆ నామ మహిమ తెలియదు," అన్నాడు.

రామనామం రహస్యమని, తన గురువు ఎందుకు చెప్పాడో ఇప్పుడు శిష్యునికి అర్థమైంది. అప్పటి నుండి తను భక్తి, విశ్వాసాలతో, కృషిచేసి జ్ఞానోదయం పొందాడు.

# కర్మాబాయి చరిత్రము

## భగవన్నామముచే సర్వశుభములు కలుగును

జగన్నాథక్షేత్రమున కర్మాబాయి నివసించుచుండెను. ఆమె గర్భవతిగా వున్నప్పుడే ఆమె భర్త పరలోకగతుడయ్యెను. ఆమె భర్త వియోగమునకు ఎంతో బాధపడి, భరింపరాని ఆ దుఃఖమును భరించి ఒక పుత్రుని గనెను. ఆ సాధ్వి తన కుమారునకు తగిన సమయమున పుట్టు వెంట్రుకలు తీయించి వడుగు చేయించి వేదాధ్యయనపరుని చేసెను. అతని పదహారవయేట తగిన కన్యతో వివాహము జరిపించెను. కొంతకాలమునకు కర్మాబాయి కోడలు ఒక పుత్రునికి జన్మనిచ్చెను. మనుమడు కలిగిన కొన్నినాళ్ళకే కర్మాబాయి కుమారుడు మరణించెను. కర్మాబాయి పుత్రోశోకమును దిగమ్రింగుకొని మనుమని పెంచుచుండెను. ఇలా వుండగా ఆ మనుమడుకూడ ఆకస్మిక మరణమునొందెను. అపుడు కర్మాబాయి తన ప్రారబ్ధమునకు వగచుచు, భర్తృ పుత్రపౌత్ర వియోగమును పొంది ఏకాకినైతిని, ఈదుఃఖ సముద్రమును ఎటుల దాటుటయని విచారించుచు, చింతతో రోజులు గడుపుచుండెను.

ఆమె భాగ్యవశమున జగన్నాథయాత్రకు వచ్చిన ఒక భగవద్భక్తుడు ఆమె ఇంట బసచేసెను. కర్మాబాయి రాత్రింబగళ్ళు దుఃఖించుట గమనించి దుఃఖ కారణ మడిగెను. ఆమె తన కథనంతను వివరముగా అతనికి తెలిపెను. ఆ భాగవతుడు ఈ సంసారమున కొంచెమైనను సుఖములేదు. ఈ చింతను విడువుము. నీకు పరమార్థమును వుపదేశించెదను. నా మాటలు అబద్ధములు కావు. నేను డబ్బుమీద ఆశతో కాని, భ్రమచే గాని నీకు ఉపదేశము చేయుటలేదు. మనుష్యుడు పుట్టిన తోడనే బాల్యమును, తరువాత యవ్వనమును, తప్పించుకోలేని ముసలి తనమును పొంది చివరకు మృత్యువాతపడును. ఇవన్నియు నీవును నేనును మన కన్నులతో చూచుచున్నదే కదా! మరణించిన వారు మరల జన్మమును పొందుట తప్పనిసరి. ఈ అనర్థమునకు శృతి స్మృతి మొదలైన శాస్త్రములే ప్రమాణములు. ఈ దేహము కలుగుటకు క్రిందటి జన్మలో చేసిన పాప పుణ్యములతో కూడిన ఆత్మయే కారణము. పిండోత్పత్తికి ఆత్మయే మూలకారణము. కావున మానవునకు తల్లి కడుపులో పడినది మొదలు మరణించువరకు దుఃఖమే కలుగుచున్నది. అన్నపానములచే ఆకలి దప్పులు తీరుచున్నవి. తగిన ఉపాయములచే శీతోష్ణములనుండి తప్పించుకొనుచున్నాము. ఇదియే సుఖమని అనుకొనుట అవివేకము. అన్నపానాదుల సంపాదనకై చేయు ప్రేయత్నములు ఎంతో కష్టముతో కూడినవి. అజీర్ణముచే కల్గు బాధను చెప్పలేము. శరీరమునకు వాతము కలిగినప్పుడు గుద్దుకొనుట వలన, మర్దించుట వలన, తొక్కించుకొనుట వలన సుఖముగా నుండును. ప్రణయకలహమున, కోపించిన ప్రియురాలు కాలితో తన్నినను అదియే ప్రియునికి హాయిగా నుండును. ఇట్లు దుఃఖ కారణముల యందునే సుఖమున్నదని భ్రాంతిని కలిగియుందుము. రక్త, మాంస, శ్లేష్మ, మల, మూత్ర, మజ్జాస్థి, స్నాయువులతో కూడిన శరీరమున సౌందర్య,



సౌకుమార్య, సౌలభ్యము కాంతి మొదలగు గుణములు కలవని అనుకొనుట భ్రాంతి. ఈ శరీరమును ప్రేమించువాడు నరకమును పడును. చలివేయునపుడు వేడి, దాహము కలిగినపుడు నీరు, ఆకలివేయునపుడు అన్నము సుఖముగానే తోచును. అవసరము లేనపుడు వేడి, నీరు, ఆహారమము సుఖముగానుండవు. మనుష్యుడు ఎంత ధన ధాన్య రత్నములను ప్రోగుజేయునో అవి అంత దుఃఖకారణములగును. తనకు ప్రియమైన పుత్ర, మిత్ర కళత్రములతో సంబంధము ఎంత గాఢముగా నుండునో ఆ బంధము హృదయమున అంత పెద్ద ముల్లుగా గ్రుచ్చుకొనును. తన సంపదకు దూరముగా నున్నను మనుష్యునికి దొంగలవలన, అగ్ని వలన భయము నిరంతరము బాధించుచుండును. పుట్టునపుడు పొందు బాధయంతయు మరణించునపుడు కూడ పొందుదుము. మరణించిన తరువాత మరల గర్భవాసము కూడ మహాదుఃఖమునే కలిగించును. అందువలన ఈ జగమంతయు దుఃఖమయమే అయి వున్నది. ఈ సకల దుఃఖములకు నిలయమైన సంసారసాగరమును శ్రీమన్నారాయణుడు ఒక్కడే దాటించువాడు. ఇది నిజము. నేను వృద్ధురాలనైతిని. ఆ జగదీశుని పూజించు సామర్థ్యము ఇపుడు నాకు లేదని అనకుము.

బాల్య యవ్వన జర మరణావస్థలు దేహమునకే గాని ఆత్మకు లేవు. శరీరమున వున్న ఆత్మ శాశ్వతమైనది. లోకములో జనులు బాల్యము గడచి యవ్వనము వచ్చిన తరువాత మంచిని పొందుదునని, యవ్వన కాలములో వార్థక్యములో మంచి జ్ఞానమును పొందవచ్చునని తలచును. ముసిలితనము వచ్చి శరీరబలము తగ్గిన తరువాత యవ్వనమునందే మేల్కొనక మూఢుడనైతినని యిపుడు దుర్బలుడనైతినని విచారించును. ఒక్కొక్కసారి మోహములలో పడి శ్రేయోమార్గమును గురించి తలంచనే తలంచడు. నీటిలో బట్టలు ఉతుకు చాకలి దాహము వేసినను, ఆ బట్ట వుతికిన తరువాత, ఆ బట్ట వుతికిన తరువాత అని తన దాహమును తీర్చుకొనకుండ కాలయాపన చేయుచుండును. జాలరి కూడ ఈ చేప తరువాత ఈ చేప తరువాత అని ఇంటికి పోవుటకు జాగుచేయును. రాబోవు కాలమును తలచి వర్తమానమును వ్యర్థము చేయకూడదు. బాల్యయవ్వన జరామరణావస్థలు శరీరమునకే గాని ఆత్మకు లేవని తలచి వివేకివై నీ ఆత్మను మేల్కొలుపుము. అన్ని విధములుగా సంసార బంధ విమోచనుడగు శ్రీమన్నారాయణుని స్మరింపుము. అందులో కష్టమేమియు లేదు. అతనిని స్మరించినంత మాత్రమున సకల పాపములు నశించి సర్వశుభములు కలుగును. నిరంతరము హరినామస్మరణ చేయు, హరికి ప్రియులైన వారి స్నేహము చేయుము. సత్యాంగత్యము వలన మోహాది సకలక్లేశములు తొలగును. ఒకవేళ సకల ప్రాణులను ఐశ్వర్య విద్యాబలాదులచే తనకన్న మిన్నగా వున్నారని, తాను బలహీనుడనని తలచినను వారిపై అసూయను, ద్వేషమును చూపకూడదు. ద్వేషము హానికారకము కావున ఎవరియందు మాత్సర్యము కలిగి యుండరాదు. సమస్త చరాచరములను శ్రీ మహావిష్ణుస్వరూపముగా భావించుమ అని హితము పలికెను. ఆమెకు తారకమంత్రము ఉపదేశించెను. ఆమెకు ఒక కృష్ణవిగ్రహమునిచ్చి నీవు నీ

పుత్రపౌత్రాదులను ఎటుల లాలింతువో అటులనే యీ గోపాలమూర్తిని లాలింపుము. నీకు భగవదనుగ్రహము కలిగి తిరిగి జన్మలేని మోక్షము కలుగునని బోధించి తన దారిన బోయెను.

అది మొదలు కర్మాబాయి ప్రతిరోజు ప్రొద్దున్నే లేచి పండ్లు తోముకొని, బిడ్డడు ఆకలికి వుండలేడని గబాగబా వండి గోపాలునికి పెట్టుచుండెను. అతనిని ఊయలలో పెట్టి జోలపాట పాడి నిద్రబుచ్చి తరువాత తాను స్నానము జేసి తన దినచర్యను సాగించుచుండెను.

ఇలా జరుగుచుండగా ఒకనాడు కర్మాబాయి యింటికి పంచకాల పరాయణులగు కొందరు బ్రాహ్మణులు వచ్చిరి. వారు ఆమె చేయు పనులను జూచి నీవు ప్రొద్దున్నే వంటవండినట్లున్నది. ఇప్పుడు స్నానము చేయుచున్నావు. కారణమేమని అడిగిరి. అందులకామె నేను పెందలకడనే లేచి అన్నము వండి పిల్లవానికి అన్నము పెట్టి జోలపాడి నిద్ర పుచ్చితిని. ఇప్పుడు స్నానమునకు పోవుచున్నాను. నిద్రలేవగనే బిడ్డ పనిచూచుటయే నాకు ముఖ్యమని చెప్పెను. వారు మీ యింట బిడ్డడేడి అని అడిగిరి. కర్మాబాయి శ్రీవేణుగోపాలమూర్తిని ఎత్తుకొని వచ్చి వారికి చూపి తన కథనంతను చెప్పెను.

ఆ బ్రాహ్మణులు సంతోషించి కర్మాబాయి శ్రీ వేణుగోపాలునికి చేయు ఉపచారములను శ్రద్ధగా గమనించిరి. ఆమె పెట్టెడి అన్నమును శ్రీకృష్ణుడు స్వయముగా వచ్చి ఆరగించెను. వారి ఆశ్చర్యమునకు అంతులేదు. కర్మాబాయి వారితో పిల్లవాడు ఆకలికి ఆగలేడు. కావున ప్రతిదినము అతనికి అన్నము వండి, పెట్టిన తరువాతనే నేను స్నానము చేసెదనని చెప్పెను. ఆ బ్రాహ్మణులు ఆమె భక్తికి, ఆమెకు భగవంతుని యందు ఉన్న వాత్సల్యమునకు సంతోషించిరి. కాని స్నానాదులు చేసిన తరువాతనే అన్నము వండుట మంచిదని చెప్పిరి.

వారు చెప్పినట్లే కర్మాబాయి స్నానము చేసిన తరువాతనే శ్రీకృష్ణునికి అన్నము వండి పెట్టెను. ఆ రాత్రి గోపాలదేవుడు ఒక అర్చకునికి కలలో కనిపించెను. నన్ను తెలియని కొందరి మాటలు విని కర్మాబాయి రోజువలె కాక స్నానము చేసి ఆలస్యముగా నాకు అన్నము వంటి పెట్టినది. నేను ఆకలిచే మిగుల బాధపడితిని. పరమ భక్తురాలైన కర్మాబాయికి యీ నిబంధనలు అవసరము లేదు. ఆచారములు పాటించక ఎప్పటివలెనే నా సేవ చేయవలయునని చెప్పెను. ఆ అర్చకుడు ఆశ్చర్యపడి కర్మాబాయికి యీ విషయము తెలియజేసెను. నా తెలివి తక్కువచే బిడ్డడిని ఆకలితో బాధించితినని, బాధపడి కర్మాబాయి మరునాడు ఎప్పటివలెనే స్నానము చేయకుండ శ్రీకృష్ణునికి అన్నము వండిపెట్టెను. ఈ వింతను వచ్చిన బ్రాహ్మణులు అర్చకుడు చూసి ఆనందముతో అనేక రీతుల భగవంతుని స్తోత్రము చేసిరి. కర్మాబాయి ఆ విధముగా తన జీవితమంతయు భగవంతుని ఆరాధించి, ఆకటాక్షము వలన జన్మరాహిత్యము పొంది విష్ణులోకమును చేరెను.

**(పై కథ "మహాభక్త విజయం" నుండి సరళభాషలో గ్రహించబడినది)**



# హనుమత్ సముద్రోల్లంఘనం

-బ్రహ్మచారిణి.

## సాగర లఘనం లోని సారము

హనుమంతుడు సముద్రమును దాటునపుడు ఎదురైనటువంటి ప్రతిబంధాలను ఏ విధంగా తొలగించుకోగలిగాడో తెలుసుకొని మనం కూడా మన సాధనలో ఎదురయ్యేటటువంటి ప్రతిబంధాలను తొలగించడానికి ప్రయత్నించగలగాలి.

సముద్రమును దాటుటకు సమర్ధుడయిన వారు కేవలం హనుమంతుడు మాత్రమే అనే విషయాన్ని తెలుసుకొని జాంబవంతుడు హనుమంతుడిని ప్రోత్సహిస్తూ తనకున్నటువంటి శక్తులను గురించి తెలియజేస్తాడు. జాంబవంతుడి ప్రోత్సాహంతో సముద్రాన్ని దాటుటకు సిద్ధమయిన హనుమంతుడు అందరికంటే పెద్దవాడయిన జాంబవంతుడుకి మరియు యువరాజు అయినటువంటి అంగదుడికి, మిగతా వానరులందరికి నమస్కారం చేసి కార్యాన్ని ప్రారంభించడం జరిగింది.

దీనినుండి మనం తెలుసుకోవలసినది ఏమిటంటే ఏదైనా కార్యం మొదలు పెట్టడానికి ముందు మనకంటే పెద్దవారికి, మనతోటివారికి, మనకంటే చిన్నవారికి కూడా నమస్కారం చేయడం వలన మనం పూర్తి చేయాలనుకున్నటువంటి కార్యంలో ఎలాంటి ప్రతిబంధాలురావు. ఒకవేళ ప్రతిబంధాలు వచ్చినా కూడా ఎదుర్కొనేటటువంటి శక్తి లభిస్తుంది. అందరికీ నమస్కారం చేయడంలో మనయొక్క అహంకారం అనేది తగ్గిపోతుంది. అహంకారం తగ్గిపోయినపుడు ఏకార్యమైనా నిర్విఘ్నంగా పూర్తవుతుంది.

హనుమంతుడు సముద్రమును దాటుతున్నప్పుడు ఎదురైనటువంటి ప్రతిబంధాలలో మొదటిది మైనాకపర్వతం. రామకార్యాన్ని నెరవేర్చడానికి వెళుతున్నటువంటి హనుమంతుడికి అలసట తీర్చుకోవడానికని ఆశ్రయమివ్వడం కోసం మైనాకుడు హనుమంతుడిని ఆహ్వానించడం జరుగుతుంది. హనుమంతుడు తిరస్కరించకుండా మైనాకపర్వతం మీద పాదం మోపి రామకార్యం పూర్తయ్యేవరకు నేను విశ్రాంతి తీసుకోలేను అని చెప్పి ముందుకు వెళతాడు.

హనుమంతుడి లక్ష్యం రామకార్యం పూర్తిచేయడం. మైనాకుడు ఆహ్వానించినపుడు మైనాకుడిని తిరస్కరించి బాధపెట్టకుండా, తన సమయం వృధా చేసుకోకుండా పర్వతం మీద పాదం మోపి వెళ్ళిపోతాడు. అలాగే మనంకూడా ఎవరితోనైనా ఏదైనా చర్చ చేస్తున్నా, లేదా ఇతరుల సంబంధంలో వారితో మాట్లాడుతున్నప్పుడు కాని, వారితో ఏదైనా కార్యం చేస్తున్నప్పుడు కాని, ఎదుటివారిని తిరస్కరించకుండా, బాధ పెట్టకుండా మనం బాధపడకుండా ఉండే విధంగా ప్రవర్తించగలగాలి.

హనుమంతుడి వారికి సురస అడ్డుపడుతుంది. సురస హనుమంతుడిని తినేస్తాను అన్నప్పుడు హనుమంతుడు ఈ దేహంద్వారా రామకార్యం పూర్తి చేయవలసి వుంది. కాబట్టి రామకార్యాన్ని పూర్తిచేసాక వచ్చి ఈ దేహాన్ని నీకే అర్పిస్తాను అంటాడు.

అందుకు సురస అంగీకరించదు. హనుమంతుడు దేహబలాన్ని ఉపయోగిస్తాడు. దేహాన్ని పెంచుకుంటూ వెళతాడు. సురసకూడా తననోటిని పెంచుకుంటూ వెళ్తుంది. హనుమంతుడు భావిస్తాడు-ఇలా దేహాన్ని పెంచుకుంటూ పోవడంలో ఎటువంటి ప్రయోజనము లేదు అని. బుద్ధిబలాన్ని ఉపయోగిస్తాడు. స్థూలంగా పెంచిన దేహాన్ని సూక్ష్మంగా చేసి సురస నోటిలోకి ప్రవేశించి బయటకు వచ్చేస్తాడు. "ఓ మాతా! నేను నీవు కోరుకున్నట్లుగా నీ నోటిలోనికి ప్రవేశించాను. కానీ నీవు ఆ అవకాశాన్ని ఉపయోగించుకోలేదు. కాబట్టి నా మార్గం నుండి అడ్డు తప్పుకోవలసిందిగా కోరుతున్నాను" అనగానే సురస హనుమంతుడి తెలివికి సంతోషించి ఆశీర్వదించి పంపిస్తుంది.

మన జీవితంలో కూడా కొన్నిసార్లు ప్రతిబంధాలు ఏర్పాడుతాయి. దేహబలంతో ఎదుర్కోగలిగితే దేహబలంతో ఎదుర్కోవాలి. దేహబలంతో ఎదుర్కోలేనప్పుడు బుద్ధి బలాన్ని ఉపయోగించి హనుమంతుడి వలే ప్రతిబంధాలను తొలగించుకొని కార్యాన్ని నెరవేర్చుకోగలగాలి.

హనుమంతుడు ఆకాశంలో నుండి వెళుతుండగా నీటిలో ఉన్నటువంటి సింహిక హనుమంతుడి నీడను పట్టుకుంటుంది. అదిపైన వెళ్ళే పక్షుల నీడను పట్టుకొని తినేస్తుంది. హనుమంతుడికి సందేహం కలుగుతుంది, ఏమిటినేను ముందుకు వెళ్ళడంలేదు, క్రిందకు వెళుతున్నట్లుగా అనిపిస్తోంది అని గమనించి, ఇదంతా సింహిక అనే రాక్షసి మాయ అని తెలుసుకొని వెంటనే సింహికను సంహరిస్తాడు హనుమంతుడు.

సింహిక ఎందుకు పైన వెళ్ళే వాటి నీడను మాత్రమే పట్టుకొని వాటిని సంహరించాలనుకుంటుంది? నీటిలో ఉన్న వాటిని కూడా పట్టుకొని సంహరించ వచ్చు కదా! కాని సింహిక అలా చేయదు. దీనినే అసూయ అంటారు. ఎవరిలో అయితే అసూయ అనేటువంటిది ఉంటుందో వారు తోటివానిని కాని, క్రిందవారిని కాని ఏమీ చేయాలని అనుకోరు. అసూయ అనేది పైన ఉన్నవారిపై ఉంటుంది. కాబట్టి మనకంటే ఎక్కువ ధనం ఉన్నవారిని లేదా ఎక్కువ జ్ఞానం ఉన్నవారిని లేదా ఎక్కువ ప్రతిష్ఠ కలిగినటువంటి వారిని మనం కిందకు వెళ్ళేలా చేయాలి అనుకుంటాము. ఎవరిలో అయితే అసూయ అనేది ఉంటుందో సింహికలాగా వారు నాశనమవుతారు.

కాబట్టి ఇతరులపైన మనకు అసూయ అనేది ఉండకూడదు. అలాగే ఇతరులకు మనపైన అసూయ కలిగినప్పుడు, వారికి మనం తెలియజేయవలసినది ఏమిటంటే, పేరు ప్రతిష్టల మీదకాని, ధనంమీదకాని, ఇంకా ఏ ఇతరమైన వాటిపైన నాకు ఆసక్తి లేదు. నా లక్ష్యం నేను మోక్షం పొందాలి. దానికి మించి నాకు ఇంకేమి వద్దు అని ఎప్పుడైతే తెలియజేస్తామో అప్పుడు ఆ ప్రతిబంధం అనేటువంటిది తొలగిపోయి సాధనలో ముందుకు వెళ్ళడానికి అవకాశం ఉంటుంది.

**హరిః ఓం**



## కార్యక్రమములు - మాతృ ఆశ్రమం

**తేది 06-09-2023 (బుధవారం) :** శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఉ॥గం. 7.30ని॥లకు కృష్ణమందిరంలో పూజ, మరియు సా॥గం. 8.00లకు ప్రార్థనామందిరంలో పూజ, జోలావుత్సవము జరుపబడును.

**తేది 07-09-2023 (గురువారం) :** రా॥గం. 7.30ని॥లకు గురుకుల బాల బాలికలకు ఉట్టికొట్టు ఉత్సవము.

**తేది 08-09-2023 (శుక్రవారం) :** పూజ్యశ్రీ శివానంద మహరాజ్ వారి జయంతి సందర్భంగా ఉ॥గం. 7.30ని॥లకు స్వామీజీ అష్టోత్తర శతనామార్చన. (ప్రార్థనా మందిరం.)

**తేది 18-09-2023 (సోమవారం) :** వినాయకచతుర్థి సందర్భంగా శ్రీ శాంతి గణపతికి పూజ (ప్రవేశద్వారము)

**తేది 24-09-2023 (ఆదివారం) :** పూజ్యశ్రీ చిదానంద స్వామివారి జయంతి సందర్భముగా ఉ॥గం. 7.30ని॥లకు స్వామీజీ అష్టోత్తర శతనామార్చన. (ప్రార్థనా మందిరం.)

| | |
|---|---|
| **1. మాతృ ఆశ్రమం**<br>శ్రీ శాంతి ఆశ్రమము<br>తోటపల్లి కొండలు,పిన్ : 533 446<br>వయా శంఖవరం, కాకినాడ జిల్లా<br>సెల్ : 7382009962<br>రిసెప్షన్ : 7815890094<br>e-mail : srisanthiashram@gmail.com | **4. కోటగిరి శాఖ**<br>పీస్ సెంటర్, డార్మోనా రోడ్,<br>కోటగిరి - 643217,<br>నీలగిరి జిల్లా, తమిళనాడు<br>ఫోన్ : 04266 - 271945<br>e-mail: vsvmsktg@yahoo.com<br>vsvmsktg@gmail.com |
| **2. విశాఖ : శాంతి ఆశ్రమము**<br>లాసన్స్‌బే, పెదవాల్తేరు-530 017<br>విశాఖపట్నం<br>ఫోన్ : 0891 - 2538689<br>e-mail : srisanthiashramvsp@gmail.com | **5. కాకినాడ శాఖ**<br>శాంతి ఆశ్రమము,అశోక్ నగర్<br>కాకినాడ - 533 004<br>కాకినాడ జిల్లా |
| **3. విశ్వశాంతి క్షేత్రం**<br>కైలాసగిరి<br>విశాఖపట్నం | **6. పిఠాపురం శాఖ**<br>స్టువర్టు పేట,పిఠాపురం-533 450<br>కాకినాడ జిల్లా |

Website : www.srisantiashram.org

# దాతలకు విజ్ఞప్తి

దివ్యాత్మ స్వరూపులకు సూచన. శ్రీ శాంతి ఆశ్రమమునకు విరాళము ధన రూపంలో / చెక్కు / ఎస్.బి.ఐ. కత్తిపూడి, అకౌంట్ నెం. 11003309435 కు IFSC Code : SBIN0014774 ఆన్‌లైన్ ద్వారా పంపగలరు. మీ విరాళములకు ఇన్‌కమ్‌ట్యాక్స్ 80జి రాయితీ కలదు. మీరు ఏ విధంగా విరాళము పంపినను వ్రాత పూర్వకంగా లేదా ఇమైయిల్ ద్వారా మొబైల్ నంబరు 7382009962 మరియు రిసెప్షన్ నెంబరు 7815890094కు మీ పేరు, చిరునామా మీ మొబైల్ నంబరు తెలుపగలరు.

# శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి

శాంతి పత్రిక ప్రతినెలా 1,2 & 3 తేదీలలో పోస్టు చేయబడును.

సం॥ర చందా రూ.100/-, జీవిత చందా రూ.1000/- (12 సంవత్స రముల వరకు మాత్రమే), ఎమ్.ఓ/స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కత్తిపూడి అకౌంట్ నెం.11003309435, ఆన్‌లైన్ ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.

ఎమ్.ఓ.ఫారమ్‌లో దిగువ ఫర్ కమ్యూనికేషన్ భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.

చందాకాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొనవలెను. మీ అడ్రస్ మార్పు జరిగితే, ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి. చందా వివరములు తెలుపని యెడల సొమ్ము విరాళముగా జమచేయబడును.

కార్యదర్శి, శ్రీ శాంతి ఆశ్రమం (పోస్ట్)
వయా శంఖవరం - 533 446, తూ.గో.జిల్లా

# విన్నపము

విదేశములలో వుండు ఆశ్రమ భక్తులు విరాళములు ఈ క్రింది ఎఫ్.సి.ఆర్.ఎ (Foreign Contributions Regulation Act) బ్యాంక్ అకౌంట్‌కు తమ యొక్క నివసించే ప్రాంతములోని తమ బ్యాంక్ అకౌంట్ నుండి ఆదేశ కరెన్సీలో పంపగలరు. పంపిన పిదప వివరములు srisanthiashram@gmail.com అనే మెయిల్ ఐడికి మరియు mattavvs07@gmail.com తప్పకుండా పంపవలెను.

బ్యాంకు పేరు : State Bank of India, 11 Sansad Marg, New Delhi -110001
A/c Name : The Mission of peace - FCRA A/c No : 40127798428
Swift Code : SBININBB104



# విరాళములు

| | | |
|---|---|---|
| 1. | శ్రీమతి ఎన్.కుసుమరావు గారు (ముంబాయి) | 5,000/- |
| 2. | శ్రీ సత్యనారాయణ ఇరుకు గారు (హైదరాబాదు) | 5,000/- |
| 3. | శ్రీ జామి సాయిప్రసాద్ గారు (అనపర్తి)<br>వీరి కుమారుడు చి॥శ్రీరామపవన్‌కుమార్ గారి పుట్టినరోజు సందర్భముగా | 3,600/- |
| 4. | శ్రీ ముమ్మిన శ్రీనివాస్ గారు (విశాఖపట్నం)<br>వీరి తండ్రిగారు శ్రీ ఎమ్.సోమినాయుడు గారి జ్ఞాపకార్థం అన్నదానం | 10,000/- |
| 5. | శ్రీ కె.జి. కృష్ణమూర్తి గారు (బెంగుళూరు) | 5,000/- |
| 6. | శ్రీ పి.భాస్కరరావు గారు (బెంగుళూరు)<br>శాంతి స్తోత్రమాల ప్రింటింగ్ నిమిత్తం | 35,000/- |
| 7. | శ్రీమతి రేణుక అశోక్‌కుమార్ గారు (కోయంబత్తూరు)<br>వీరి భర్త అశోక్‌కుమార్‌గారి జ్ఞాపకార్థం | 5,000/- |
| 8. | శ్రీ పి. హరికుమార్‌శర్మ గారు (శాంతి ఆశ్రమం)<br>వీరి గృహప్రవేశం నిమిత్తం అన్నదానం | 10,000/- |
| 9. | శ్రీ అరవింద్ ప్రధాన్ గారు (హౌరా), బిల్డింగు రిపేర్లు | 2,00,000/- |
| 10. | శ్రీమతి మాజేటి సీతాదేవి గారు (హైదరాబాదు) | 5,000/- |
| 11. | శ్రీ క్రొవ్విడి వీరభద్రప్రసాద్‌రావు గారు (రాజమండ్రి) | 10,000/- |
| 12. | శ్రీ పోరంకి సచ్చిదానందమూర్తి గారు (హైదరాబాదు) | 10,000/- |
| 13. | డా॥నర్సింహరావు గారు (హైదరాబాదు) | 5,000/- |
| 14. | శ్రీ సుబ్రమణియన్ & శ్రీరామసుబ్రమణియన్ గారు | 10,000/- |
| 15. | శ్రీ తణుకు వెంకటేశ్వర్రావు గారు (హైదరాబాదు)<br>విద్యార్థుల పుస్తకముల నిమిత్తం | 30,000/- |
| 16. | శ్రీ కె. వెంకటరమణారెడ్డి గారు (విజయవాడ)<br>విద్యార్థుల పుస్తకముల నిమిత్తం | 21,220/- |
| 17. | శ్రీ వి. హనుమంతరావు గారు (శాంతి ఆశ్రమం) | 10,000/- |
| 18. | శ్రీమతి సంకా విజయలక్ష్మి గారు (బెంగుళూరు) | 6,001/- |
| 19. | శ్రీమతి సి.హెచ్. సుచరిత గారు (విజయవాడ)<br>విద్యార్థుల పుస్తకముల నిమిత్తం | 40,000/- |
| 20. | డా॥కృష్ణరాం భరతుల (ఢిల్లీ) | 25,000/- |
| 21. | శ్రీ ఎస్. గణపతిరావు గారు (రాజమండ్రి) | 10,000/- |
| 22. | శ్రీ పి. సత్తిబాబు గారు, శ్రీమతి వెంకటలక్ష్మి గారు (కాకినాడ)<br>వీరి తల్లిగారు శ్రీమతి పి.సత్యవతిగారి జ్ఞాపకార్థం అన్నదానం | 4,000/- |
| 23. | శ్రీ కొత్తూరు దుర్గా క్షితీష్ గారు (విజయవాడ)<br>విద్యార్థుల పుస్తకముల నిమిత్తం | 21,111/- |
| 24. | శ్రీ వీర్రాజు పిచిక గారు (విశాఖపట్నం) | 10,000/- |
| 25. | శ్రీమతి దూళిపూడి విజయకనకదుర్గ గారు (శాంతి ఆశ్రమం)<br>వీరి భర్తగారు శ్రీ డి.వి.ఆర్.ఆంజనేయులుగారి జ్ఞాపకార్థం అన్నదానం | 10,000/- |
| 26. | శ్రీ వి.జగదీశ్వర్రావు గారు (విజయనగరం)<br>వీరి తండ్రి శ్రీ వెలిది రంగారావు గారి జ్ఞాపకార్థం | 8,000/- |

# శ్రీ శాంతి ఆశ్రమ ప్రచురణలు

1. శాంతి ప్రదాత శ్రీ స్వామి ఓంకార్ ఆత్మకథ ---------- 100/-
2. ఓంకార సద్భోధామృతము ---------- 70/-
3. సోహం ---------- 10/-
4. ఓం జపం ---------- 10/-
5. మౌనపు ఘడియలు ---------- 30/-
6. ప్రేమయే దైవము ---------- 10/-
7. భగత్సాక్షాత్కారము ఇప్పుడు ఇక్కడే ---------- 10/-
8. శాంతి దళములు ---------- 10/-
9. ఆధ్యాత్మిక మెరుపులు ---------- 10/-
10. సత్సంగ సందేశములు ---------- 30/-
11. ఓంకార సూక్తులు ---------- 10/-
12. ఓంకార స్తోత్ర కదంబం ---------- 10/-
13. శాంతి సూక్తులు ---------- 10/-
14. శాంతి ప్రార్థన ---------- 20/-
15. శ్రీ శాంతి స్తోత్రమాల ---------- 30/-
16. స్వామి ఓంకార్ ఆత్మదర్శిని ---------- 20/-
17. సందేశ తరంగిణి ---------- 40/-
18. నా చెల్లి పునర్జన్మ ---------- 10/-
19. నేను ఆంగ్లభాష ఎలా నేర్చుకొన్నాను. ---------- 20/-
20. శ్రీశ్రీశ్రీ ఓంకార స్వామి స్తోత్రము ---------- 20/-
21. శాంతి దూత స్వామి ఓంకార్ ---------- 30/-
22. స్వామి ఓంకార్ జీవిత విశేషాలు ---------- 10/-
23. శ్రీ శాంతి ఆశ్రమ చరిత్ర (1917-2020) ---------- 100/-
24. ధ్యానము ---------- 30/-
25. పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ వారి దివ్య సందేశములు దేశ విదేశీయ పర్యటనలు 50/-
26. ప్రార్థనలు - ధ్యానములు ---------- 20/-
27. విశ్వ ప్రార్థన ---------- 20/-
28. శ్రీ శాంతి ఆశ్రమం శతాబ్ధి సంచిక ---------- 120/-
29. నిత్య సందేశములు ---------- 20/-
30. ఆంతర్య భావనలు ---------- 20/-
31. శ్రీ ఓంకార బోధామృతం ---------- 20/-
32. నాల్గు దశలలో ఉపదేశము ---------- 10/-
33. శాంతి ప్రార్థన - స్వామి ఓంకార్ ---------- 20/-

This Periodical is Registered with Registar of Newspapers, New Delhi Vide R.No. 3447/57,
Dt. 18-12-20 Permitted to Post Under Concessional Postage Vide AP/KD-24/2021-2023

# SRI SANTI ASHRAM ENGLISH PUBLICATIONS

1. Auto Biography of swami Omkar (2 Volumes) .......... Rs. 150/-
2. Life and Teachings of Swami Omkar .......... Rs. 10/-
3. Soham .......... Rs. 10/-
4. Cosmic Fast .......... Rs. 20/-
5. Meditation .......... Rs. 10/-
6. Om Japa .......... Rs. 10/-
7. Control of Mind .......... Rs. 30/-
8. Cosmic Flashes .......... Rs. 10/-
9. In the Hours of Silence .......... Rs. 10/-
10. The Soul of Omkar .......... Rs. 10/-
11. How I learned English .......... Rs. 10/-
12. Reincarnation of my Little Sister .......... Rs. 10/-
13. God Realization Now and Here .......... Rs. 10/-
14. Mystic Prayers and Poems .......... Rs. 20/-
15. The Divine Voice of Omkar .......... Rs. 40/-
16. Auto Biography of Omkar (Revised Edition) .......... Rs. 100/-
17. Petals of Peace .......... Rs. 20/-
18. The Story of my life and Work .......... Rs. 10/-
19. Priceless legacy of Swami Omkar .......... Rs. 10/-
20. The Four Initiations .......... Rs. 10/-
21. Musings .......... Rs. 20/-
22. Peace Prayer .......... Rs. 20/-

**THE MISSION OF PEACE**

**శ్రీ శాంతి ఆశ్రమము**

పోస్టు: శాంతి ఆశ్రమము
(వయా) శంఖవరం - 533 446
తూ॥గో॥జిల్లా, (ఆం.ప్ర.)
ఫోన్ : 7382009962
email: srisanthiashram@gmail.com
www: www.srisantiashram.org

Book Post

______________________

______________________

______________________

Printed by Mohan Graphics and Published by MVV Satyanarayana on behalf of The Mission of Peace - Sri Santi Ashram and printed at Mohan Graphics, Kakinada - 533 001. Ph:0884-2361419 and Published at Thotapalli Hills-533 446, Ph: 73820 09962 Editor : Swamini Vinamrananda